# వైఎస్ఆర్-అన్నమయ్య

## వార్త

సోమవారం 02 జూన్ 2025

## చౌక దుకాణాల పంపిణీ

**తంబళ్లపల్లె జూన్ 1 ప్రభాతవార్త ః**



మండలంలోని పూర్వ చౌక దుకాణాలలో నిత్యవసర సరుకులు పంపిణీ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. మండలంలో తంబళ్లపల్లె టిడిపి ఇంచార్జ్ దాసరిపల్లి జయచంద్ర రెడ్డి ఆదేశాల మేరకు మండల టిడిపి అధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రేషన్ షాపులు సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని టిడిపి నాయకులు ఆర్భాటంగా ప్రారంభించారు. చౌక దుకాణాలలో సరుకులు పంపిణీ తో ప్రజలకు సమస్యలు తీరినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమాలలో గుండ్లపల్లి టిడిపి నాయకులు చంద్ర నాయుడు, భాస్కర్ నాయుడు, శంకర్ రెడ్డి, మల్లికార్జున నాయుడు, శ్రీనివాసులు నాయుడు, చాంద్బాషా, శ్రీనివాసులు, మండలంలోని స్టోర్ డీలర్లు, రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## యోగాతో ఇంటిల్లిపాదికీ యోగానందం..!!..



**కడప, జూన్ 1 ప్రభాతవార్త**

మన దినచర్యలో యోగా ఒక భాగంగా మారితే.. ఇంటిల్లిపాదికీ యోగానందం, ఆరోగ్య భాగ్యం సొంతం అవుతుందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. యోగాంధ్ర మనోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం కడప వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో కడప నగరపాలక సంస్థ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఫ్యామిలీ యోగా" కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో సుమారు 1000 కుటుంబాలకు చెందిన 4,365 మందికి మాస్టర్ ట్రైనర్లు యోగాసనాలపై అవగాహన, శిక్షణ ఇవ్వడం జరిగింది జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి హాజరై యోగాసనాలు వేసి జిల్లా ప్రజలకు స్ఫూర్తిగా నిలిచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జూన్ 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఫ్యామిలీ యోగా కార్యక్రమానికి ఒక్కో కుటుంబానికి చెందిన పిల్లలు, తల్లిదండ్రులు, గ్రాండ్ పేరెంట్స్ మొదలైన మూడు కెరగిరీలకు చెందిన 4,365 మంది హాజరై యోగాసనాలు వేయడం.. గర్వించదగ్గ విషయం అన్నారు. యోగా సాధనతో మానసిక సమస్యలకు, శారీరక రుగ్మతల నుండి విముక్తి లభిస్తుందన్నారు. మంచి ఫలితాలు ఇస్తుందన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ యోగాసనాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. యోగా ఆసనాలు వేయడం ద్వారా.. క్రమశిక్షణ, మెరుగైన జీవన విధానం అలవడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగాని నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని, జిల్లా యంత్రాంగం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొనాలని కోరారు. కడప నగరంలో "ఫ్యామిలీ యోగా" కాన్సెప్ట్ తో నిర్వహించిన కార్యక్రమం నగర ప్రజల్లో నూతనోత్సాహం నింపిందన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లలు, తల్లిదండ్రులు, అవ్వతాతలు మొదలైన మూడు కేటగిరీలకు చెందిన కుటుంబ సభ్యులు కలిసి పాల్గొనడం ఆనందదాయకమైన విషయం అన్నారు. కాగా "యోగాంధ్ర క్యాంపెన్ 2025" మాసోత్సవాలు మే 21 నుండి జూన్ 21 వరకు నిర్వహించడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా ఈ ఆదివారం "ఫ్యామిలీ యోగా" కాన్సెప్ట్ తో జిల్లాలోని అన్ని కుటుంబాలకు యోగాపై అవగాహన, యోగా వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలను విశదీకరిస్తూ.. అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అలాగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించే కార్యక్రమంలో జూన్ 21న విశాఖలో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరియు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటారన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో మే 21వ తేదీ నుండి జూన్ 21వ తేదీ వరకు యోగాంధ్ర 2025 క్యాంపెయిన్ ను నెల రోజులపాటు "యోగా మంత్" గా నిర్వహించడం జరుగుతోందన్నారు. అనంతరం యోగా ట్రైనర్లు కార్యక్రమానికి హాజరైన వారితో.. ప్రోటోకాల్ ప్రకారం యోగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో కడప మునిసిపల్ కమిషనర్ మనోజ్ కుమార్ రెడ్డి, కడప ఆర్డిఓ జాన్ ఇర్విన్, జిల్లా పర్యాటక అధికారి సురేష్ కుమార్, స్టెప్ సీఈఓ సాయి గ్రేస్, డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజలక్ష్మి, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రంగస్వామి, డిఎమ్ హెచ్ఓ డా.నాగరాజు, డిఎస్డిఓ జగన్నాథ రెడ్డి, ఆయుష్ నోడల్ అధికారి డా. మురళి తదితర జిల్లా అధికారులు, కుటుంబ సభ్యులు, విద్యార్థులు, ఉద్యోగులు, ఎన్జీవో ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



### కూటమి ప్రభుత్వం వచ్చిన మారని తీరు!!

# విధాన నిర్ణయాల అమలులో ఎడతెగని జాప్యం

### మున్సిపాలిటీల్లో పడకేసిన ప్రగతి... నిధుల విడుదలలో ప్రతిష్టంబన... బిల్లులు కూడ అప్‌లోడ్ చేయని దుస్థితి

**రాజంపేట అర్బన్, జూన్ 01, ప్రభాతవార్త:**

ప్రభుత్వ విధాన నిర్ణయాల అములులో ఎడతెగని జాప్యం అభివృద్ధిపై ప్రభావం చూపుతోంది. నిధులు ఉన్నా ఉపయోగించుకోలేని దుస్థితి. పనులు చేసిన బిల్లులు రాని పరిస్థితి. అందుకే టెండర్‌లు పిలుస్తున్న కాంట్రాక్టర్‌లు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. ఫలితంగా అర్బన్ కేంద్రాలైన మున్సిపాలిటీల్లో అభివృద్ధి పడకేసింది. కూటమి ప్రభుత్వం 3 నెలల క్రితం ప్రకటించిన విధాన నిర్ణయం కూడ అమలు కాలేదు. మార్గదర్శకాలు విడుదల అయిన అమలు చేయడంలో సాంకేతిక అవరోధాలు తీరలేదు. దీంతో మున్సిపాలిటీల్లో బిల్లుల అప్‌లోడ్ కూడ చేయకుండా అధికారులు మీనమేశాలు లెక్కిస్తున్నారు..వైసీపీ ప్రభుత్వం పురపాలక నిధులు కూడ మళ్లించింది. ఫలితంగా అయిదేళ్లలో అభివృద్ధి ఆటకెక్కింది. కూటమి ప్రభుత్వం వస్తేనే అభివృద్ధి పట్టాలెక్కుతుందని కూటమి నేతలు బల్లగుద్దిచెప్పారు. దీంతో నెలల తరబడి పనులు చేసిన బిల్లులు రాని గుత్తేదారులు కూటమి ప్రభుత్వం వస్తే తమ కష్టాలు గట్టెక్కుతాయని భావించారు. కొత్త ప్రభుత్వం వచ్చాక టెండర్‌లలో కూడ పాలుపంచుకున్నారు. పనులు చేశారు. ఇదిగో వస్తాయ్..అదిగో వస్తాయ్..అంటూ అధికారులు ఊరిస్తూనే ఉన్నారు. గత 10 నెలలుగా బిల్లులు మంజూరైన దాఖలాలు లేవు. ఇంకా కొన్ని పనులై 14నెలలు అయినా అతీగతీ లేదు. చివరకు పేపర్ బిల్లులు, ప్రకటనల బిల్లులు, ఎమర్జెన్సీ పనులకు సంబంధించిన నిధులు కూడ మంజూరు కావడం లేదు. సీఎఫ్ఎంఎస్, పీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేసిన నిధులు రాని పరిస్థితి ఏర్పడింది. తాజాగా రాష్ట్ర బడ్జెట్ సమావేశాల అనంతరం కూటమి ప్రభుత్వం పురపాలికల్లో ఏ గ్రాంట్ల కింద పనులు చేస్తారో ఆ గ్రాంట్‌ల నిధులతోనే చెక్కుల ద్వారా చెల్లింపులు చేసే వ్యవస్థ తీసుకువస్తామని ప్రకటించడం జరిగింది. ఈ మేరకు మార్గదర్శకాలు కూడ రూపొందించారు. అంతేకాకుండా సంబంధిత అధికారులకు శిక్షణ కూడ ఇచ్చారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి చెక్కుల ద్వారా చెల్లింపుల వ్యవస్థ షురూ చేస్తామని ప్రకటించారు. ఏప్రిల్ పోయింది, మే పోయింది, జూన్ కూడ వచ్చింది ఇంతవరకు చెల్లింపుల వ్యవస్థకు సంబంధించి సాకేతికపరమైన గ్రీన్ సిగ్నల్ లభించలేదు. దీనికి తోడు కొత్త వ్యవస్థ ద్వారా నిధులు చెల్లించవచ్చనే ఉద్దేశంతో కొందరు అధికారులు సాధారణ ఛానల్ ద్వారా కూడ బిల్లులు చెల్లించేందుకు అప్‌లోడ్ చేయకుండా పక్కన పెట్టేశారు. అందుకు కారణం ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రాలేదని చెబుతున్నారు. ఏదిఏమైనా అటు పురపాలికల్లో బడ్జెట్ సమావేశాలు ముగిశాయి. 15వ ఆర్థిక సంఘంనిధులు మంజూరు అయ్యాయి. ఆర్థిక సంవత్సరం చివరగా పనుల వసూళ్ల లక్ష్యం మేరకు సాధించారు. ఖజానా కళకళలాడుతుంది. కాదంటే బిల్లుల్ల చెల్లింపు కటకట మారింది. ఈ పరిస్థితి ఎంత కాలం అని బిలుల్ల కోసం వేచి చూసే గుత్తేదారులు ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఇకనైనా మున్సిపాలిటీల్లో పనులు జరగాలంటే పాత బిల్లులు క్లియరెన్స్ చేయాల్సి ఉంది. లేనట్లయితే పనులు చేసేందుకు గుత్తేదారుడు వెనకడుగు వేస్తున్నారు. అధికారులకు ఏమి చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా కూటమి ప్రభుత్వం మున్సిపాలిటీల్లో ఆగిన బిల్లుల క్లియరెన్స్ చేసేలా విధాన పరమైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.




రాజంపేట మున్సిపాలిటీలో నిధుల కోసం కటకట

# అత్యంత పారదర్శకంగా రేషన్ పంపిణీ జరగాలి





**రాయచోటి, జూన్ 01 ప్రభాతవార్త**

జిల్లాలోని 1123 చౌక ధరల దుకాణాల ద్వారా అత్యంత పారదర్శకంగా రేషన్ పంపిణీ జరగాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ మాసం నుండి చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ మరియు 65 సంవత్సరాల పైబడిన వారికి ఇంటి వద్దనే రేషన్ పంపిణీ జరగనున్న నేపథ్యంలో ఆదివారం ఉదయం అన్నమయ్య జిల్లా రాయచోటి లో రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, ఆదివారం ఉదయం చెన్న ముక్క పల్లి (షాప్ నెంబర్ 31) మరియు రెడ్డివారి పల్లి (షాప్ నెంబర్ 1) లలో రేషన్ పంపిణీని పునః ప్రారంభించి, పలువురు లబ్ధిదారులకు రేషన్ అందించారు. అనంతరం 65 సంవత్సరాల పైబడిన వారికి ఇంటి వద్దనే రేషన్ అందేలా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న రేషన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, రెడ్డివారి పల్లికి చెందిన రాజారెడ్డి, చెన్న ముక్క పల్లె కు చెందిన వెంకటరెడ్డి, మరియు చెన్న ముక్క పల్లె కు చెందిన దుగ్గిరెడ్డి లకు వారి ఇంటి వద్దనే స్వయంగా 10 కేజీల బియ్యం, అర్ధ కేజీ చక్కెర రేషన్ పంపిణీ చేసి వారితో వివిధ విషయాలు మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అన్నమయ్య జిల్లాలో మొత్తం 1123 చౌక ధరల దుకాణాలు ఉన్నాయని, మొత్తం రేషన్ కార్డులు 4,97,969 ఉన్నాయని, మొత్తం రేషన్ కార్డుల ద్వారా 14,82,094 మంది సభ్యులు రేషన్ ద్వారా లబ్ధి పొందనున్నారని పేర్కొన్నారు. ఇందులో 65 సంవత్సరాల పైబడిన కార్డుల సంఖ్య 53,707 గా ఉందని, ఈ కార్డుల ద్వారా 69,336 మంది సభ్యులు లబ్ధి పొందుతారని పేర్కొన్నారు. ప్రతినెల 01 నుండి 15 తారీకు వరకు ఉదయం 08 నుండి 12 గంటల వరకు సాయంత్రం 04 నుండి 08 గంటల వరకు రేషన్ పంపిణీ జరుగుతుందని పేర్కొన్నారు. ఏక లేదా ద్విసభ్య కార్డుల లోని వారి వయస్సు 65 సంవత్సరాల పైబడి వారికి, దివ్యాంగులకు వారి ఇంటి వద్దనే రేషన్ పంపిణీ ఒకటో తేది నుండి 05 వతేది వరకు 12 గంటల నుండి 4 గంటల మధ్య సమయములో పంపిణి చేయబడుతుందన్నారు. చౌక ధరల దుకాణముల ద్వారా బలవర్ధకమైన బియ్యము, చెక్కర, కొన్ని దుకాణముల నందు జొన్నలు కూడా అందుబాటులో ఉన్నాయని, బియ్యము మరియు జొన్నలు పూర్తిగా ఉచితమని పేర్కొన్నారు. తెల్ల రేషన్ కార్డుదారులకు చెక్కర అరకిలో రు.17/ కు, అంత్యోదయ కార్డుదారులకు చెక్కర ఒకకిలో 13.50/ కు లభిస్తుందని, కార్డుదారులు తప్పక రసీదు పొందవలెనని సూచించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రఘురాం, ఆ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

**బద్వేలు అర్బన్ ,జూన్ 1, ప్రభాతవార్త :**



పట్టణంలోని నెల్లూరు రోడ్డులోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడవరోజు ఆదివారం ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి, ఈవో రామలింగారెడ్డి, ఆధ్వర్యంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలను కన్నుల పండువగా నిర్వహించారు. ఇందులో భాగంగా చతుర్థాన అర్చన, మూలమూర్తి హోమం, ఉత్సవ బలి, అలాగే సాయంత్రం స్వామివారికి ఎదుర్కొలుతదు పరి ప్రధాన రహదారిలో స్వామివారి ముఖద్వారం ,డివైడర్స్ కు సహకరించిన దాతలకు స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువాతో సత్కరించారు. రాత్రి 7 గంటలకు తాడి పత్రి వారిచే భరత నాట్య కార్యక్రమం కన్నుల పండువగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మో త్సవా దర్శించుకునేందుకు పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో తరలివచ్చి స్వామివారికి కాయ కర్పూ రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కమిటి సభ్యులు కొవ్వూరు వెంకట నారాయణరెడ్డి, జొన్నలగడ్డ శ్రీధర్, గాజులపల్లె సుభద్రమ్మ, వేముల సుజాత, గంజికుంట మల్లేశ్వరి, పసుపులేటి సరస్వతి, ఆలయ సిబ్బంది రాజు, సాంబయ్యతో పాటు గోపాల్‌రెడ్డి, జయరామిరెడ్డి, పట్టణ ప్రజ లు పాల్గొన్నారు.



### నేడు వైభవంగా కళ్యాణమహోత్సవం :

స్వామివారి ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం 10 గంటలకు స్వామివారి కళ్యాణం నిర్వహించడం జరుగుతుంది. స్వామివారి కళ్యాణ మహోత్స వ కార్యక్రమాన్ని తోడేటి గంగయ్య యాదవ్ సతీమణి పెంచలమ్మల కుమారుడు సుబ్బయ్య యాదవ్ సతీమణి తిరుపతమ్మ కుటుంబ సభ్యుల సహకారంతో స్వామివారి కళ్యాణ మహోత్సవం మరియు అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని కావున స్వామివారి కళ్యాణ మహోత్సవంలో భక్తులందరూ పాల్గొని జయప్రదం చేయాలి.



**తోడేటి సుబ్బయ్య యాదవ్, ఎన్ఆర్ఐ, బద్వేలు**






# పాలన అంటే ప్రజలకు సేవ చేయడం

### ప్రచారంతో ఖజానాకు చిల్లు పెట్టడం కాదు.. జగన్మోహన్ రాజు



సరుకులు అందజేస్తున్న జిల్లా అధ్యక్షులు జగన్మోహన్రాజు, బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్

**రాజంపేట అర్బన్, జూన్1 ప్రభాతవార్త**

పాలన అంటే ప్రజలకు సేవ చేయడమని, ప్రచారంతో ఖజానాకు చిల్లు పెట్టడం కాదని టిడిపి జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రాజు అన్నారు.మెరుగైన ప్రజా పంపిణీ వ్యవస్థ తోనే ప్రజలకు మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఆదివారం పలు చౌక దుకాణాల్లో జగన్మోహన్ రాజు ,బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్ తో కలిసి రేషన్ సరుకుల పంపిణీని ప్రారంభించారు. వైసిపి హయంలో ఎండియు వాహనాలలో ప్రజా పంపి వ్యవస్థ అక్రమాలకు చిరునామాగా ఉండేది అన్నారు. రేషన్ బియ్యం నేరుగా మాఫియా కనుసన్నలలోకి వెళ్లి సొమ్ము చేసుకునే వారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం తిరిగి చౌక దుకాణాల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేసే కార్యక్రమం ప్రారంభించిందని ప్రతి నెల కోట్ల రూపాయల పొదుపుతో తాజా వ్యవస్థ ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ అంటే ప్రజలకు అనుకూలంగా ఉండాలని, అలా కాకుండా గత ప్రభుత్వం ప్రచార యావతో కోట్లాది రూపాయలను ఖర్చుపెట్టి ప్రచార వాహనాలుగా ప్రజా పంపిణీ వ్యవస్థను వినియోగించుకుని అటు ప్రజలకు ఇటు ఖజానాకు పంగనామాలు పెట్టిందని ఆయన విమర్శించారు. ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజా పంపిణీ వ్యవస్థ లో నెలలో 15 రోజులు రేషన్ అందుబాటులో ఉంటుందని, ఉదయం, సాయంత్రం రెండు విడతలగా రేషన్ అందిస్తారని , ప్రజలకు వీలున్న సమయాల్లో రేషన్ అందుకోవచ్చని తెలిపారు. రేషన్ డీలర్లు కూడా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. గౌరవప్రదంగా సేవలందించాలని, అధికారులు ఎప్పటికప్పుడు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. పాలన అంటే ప్రజలకు సేవ చేయడమని ప్రచారంతో ఖజానాకు చిల్లు పెట్టడం కాదని ఆయన గత ప్రభుత్వానికి చురకలు అంటించారు. ఈ సందర్భంగా రాజంపేట మండలం హస్తవరం చెర్లోపల్లి, వైబియన్ పల్లి, నూనె వారి పల్లి, బోయపాలెం,అమ్మవారి శాల, రాజీవ్ నగర్, మన్నూరు, పలు ప్రాంతాలలో చౌక దుకాణాలను అధికారులతో కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు, ఎమ్మార్వో పీర్ మున్నీ,టిడిపి నాయకులు మల్లెల సుబ్బరాయుడు బాసినేని వెంకటేశ్వర్లు, బాపనయ్య నాయుడు, దొంతం శివప్రసాద్, మనుబోలు వెంకటేశ్వర్లు,కూచివారిపల్లె ఉప సర్పంచ్ ముల్లగురి మల్లికార్జున్, టెక్స్మో మల్లికార్జున్, అమ్మినేని వెంకటయ్య,తేజాళ ఆనంద్, మేకా నరసింహ, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పిండిబోయిన కృష్ణ యాదవ్,అధికారులు, కార్యకర్తలు ప్రజలు అభిమానులు పాల్గొన్నారు.



పండుగ వాతావరణం లో చౌక దుకాణాల్లో రేషన్ ప్రారంభం

# ఎన్నికల హామీలను అమలు చేయని కూటమి ప్రభుత్వం




**రాయచోటి జూన్ 01 ప్రభాతవార్త**

పట్టణంలోని వైఎస్ఆర్ సిపి కార్యాలయంలో వెన్నుపోటు దినం కార్యక్రమ పోస్టర్ ను వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, వైఎస్ఆర్ సిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయక ప్రజలకు వెన్నుపోటు పొందించిం దన్నారు. రైతులకు, మహిళలకు, విద్యార్థులకు, యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే రూ 1.50 లక్షల కోట్లు అప్పులు చేసి నప్పటికీ,ఏ ఒక్క సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేయడం లేదని, అప్పులు చేసిన డబ్బులు ఎక్కడికి పోతున్నాయన్నారు. వైఎస్ఆర్ సిపి మైనారిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొలిమి హారూన్ బాష మాట్లాడుతూ గత జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా 90 శాతం ఎన్నికల హామీలను అమలు పరచి ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందించిందన్నారు. వైఎస్ఆర్ సిపి నాయకులు మాట్లాడుతూ.. జూన్ 4 న రాయచోటిలో వైఎంఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని వైఎస్ఆర్ సిపి శ్రేణులు కలసికట్టుగా విజయవంతం చేద్దామని కోరారు. ఈ కార్యక్రమానికి వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి, మాజీ ఎంఎల్ఏ రమేష్ కుమార్ రెడ్డి, నియోజకవర్గపు నాయకులు, నియోజక వర్గంలోని అన్ని మండలాల వైఎస్ఆర్ సిపి కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్ పి టిసి లు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపిటీసీ లుతదితర నాయకులు హాజరుకానున్నారని తెలిపారు. 4వ తేదీ బుధవారం ఉదయం 9.30 గంటలకు జిల్లా కేంద్రమైన రాయచోటి లోని జిల్లా కలెక్టరేట్ ప్రధాన గేట్ దగ్గర నుంచి శాంతియుత నిరసన ర్యాలీగా వెళ్లి ,జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందచేయబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో షబ్బీర్, రియాజ్, కొలిమి చాన్ బాష, అల్తాఫ్ , సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, సుగవాసి శ్యామ్, అన్నా సలీం, గౌస్ ఖాన్ , మేధావుల ఫోరం నియోజక వర్గ అధ్యక్షుడు జానం రవీంద్ర యాదవ్, రియాజుర్ రెహమాన్, కో ఆప్షన్ సభ్యుడు అయ్యావారురెడ్డి, యూసుఫ్ ఖాన్,అబుజర్, నవాజ్, జీఎండి ఇర్షాద్, జనతా బషీర్, అమీర్, బేపారి అసద్, నాగేంద్ర,ఖలీల్,చిన్న సంజీవయ్య, యూత్ కొత్తపల్లె ఇంతియాజ్, మణికంటా రెడ్డి,గువ్వల జగదీష్, సుబ్బారెడ్డి,జూలూ,ఫైరోజ్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం



**బద్వేల్ అర్బన్ ,జూన్ 1, ప్రభాతవార్త:**

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వారిని వెన్నుపోటు పొడచి మోసపూరితంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరులసమావేశంలో వారు మాట్లాడుతు జూన్ 4న జరగబోయే వెన్నుపోటు దినోత్సవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఎన్జీవో కాలనీ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్దనుండి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ జరుగుతుందన్నారు. ఈ ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు తమ నిరంకుశ, అరాచక విధానాలను అమలు చేస్తోందన్నారు. కూటమి పార్టీలు మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను భ్రమల్లో పెట్టి అధికారంలోకి వచ్చి జూన్ 4వ తేదీకి ఏడాది అవుతోందని, ఎన్నికలలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయకుండా, అడ్డంగా ప్రజలను మోసం చేయడం చరిత్రలో ఎప్పుడూ జరిగి ఉండదన్నారు. వీటిని ప్రశ్నించకుండా రాష్ట్రంలో ప్రభుత్వమే భయోత్పాతాన్ని సృష్టించిన చరిత్ర కూడా ఎప్పుడూ ఎవరూ చూసి ఉండరన్నారు. అధికారంలో వచ్చిన తొలిరోజు నుంచే ఇచ్చిన హామీల అమలుకు శ్రీకారం చుడుతూ, ఏడాది లోనే తొంబై తొమ్మిదిశాతం అమలు చేసిన ఘనత వైయస్ జగన్ కె చెల్లిందన్నారు. విప్లవాత్మక వ్యవస్థలను సృష్టించి, ఆచరణలోకి తీసుకువచ్చి, ప్రజల వద్దకే సుపరిపాలనను తీసుకువెళ్ళి చరిత్ర సృష్టించారన్నారు. వీటికి భిన్నంగా ఆ వ్యవస్థలను విధ్వంసం చేస్తూ, అరాచక పాలనను ఏడాదిలోనే చంద్రబాబు ప్రజలకు చవిచూపించారన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఎటువంటి దారుణాలకు పాల్పడవచ్చో కూడా చంద్రబాబు నిరూపించారన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలపై ఆనాడే వైయస్ జగన్ స్పందిస్తూ, వాటిని అమలు చేసే ఉద్దేశం చంద్రబాబుకు లేదని, ప్రజలను మోసం చేయడానికే ఇటువంటి హామీలు ఇస్తున్నారని చాలా స్పష్టంగా చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సాయి కృష్ణ, గోపాలస్వామి, మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షులు సుందరరామిరెడ్డి, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి రామసుబ్బారెడ్డి, జిల్లా ప్రచార విభాగ అధ్యక్షులు రాజీవ్ భాష, జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రెటరీ రాళ్లపల్లి నరసింహులు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రెటరీ హరికృష్ణ రెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు రమేష్ బాబు,రాష్ట్ర బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శి యద్దారెడ్డి, మండల కన్వీనర్లు మల్లేశ్వర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, బద్వేల్ మండల జడ్పిటిసి పోలి రెడ్డి, కోడూరు మండల జడ్పిటిసి దావీదు, బి కోడూరు మండలం సింగల్ విండో చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు శ్రీరాములు, చెన్న కృష్ణారెడ్డి, మాజీ ఫారెస్ట్ డైరెక్టర్ మల్లికార్జున్ రెడ్డి , మాధవరెడ్డి,మల్లికార్జున్ రెడ్డి, మోలాలి, పుల్లయ్య, మల్లేష్, జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు సాయి నారాయణరెడ్డి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## యువకుడిపై కత్తితో దాడి

### అడ్డొచ్చిన తల్లిదండ్రులకు గాయాలు



**మదనపల్లెక్రైం, జూన్ 1 ప్రభాతవార్త :**

ఆర్థిక లావాదేవిల కారణంగా జరిగిన కత్తిదాడిలో యువకుడు, అతని తల్లిదండ్రులు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి. మదనపల్లె మండలం కొత్తవారిపల్లి పంచాయితీ ఓబుల్‌రెడ్డిపల్లికి చెందిన టి.క్రిష్ణమూర్తి (63), జ్యోతి (52) దంపతుల కుమారుడు పృథ్వి (24), ఆదే గ్రామంకు చెందిన మదనమోహన్‌రెడ్డితో కలిసి ఆర్థికలావాదేవిలు చేసే వారు. గత కొంతకాలంగా వారి మధ్య అర్థికలావాదేవిలు లేకపోగా, డబ్బులకు సంబంధించి ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో నెల రోజుల క్రితం ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఆ సమయంలో పృథ్వీకి సంబంధించిన ద్విచక్రవాహనంకు మదనమోహన్‌రెడ్డి నిప్పు పెట్టాడు. పృథ్వీ ఫిర్యాదు మేరకు అప్పుడు తాలుకా పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిఇలా వుండగా మదన్‌మోహన్‌రెడ్డి ఆదివారం పృథ్వీ ఇంటికి వెళ్లి అతనిపై కత్తితో దాడి చేశాడు. అడ్డువచ్చిన పృథ్వీ తల్లిదండ్రులు క్రిష్ణమూర్తి, జ్యోతిలపై కూడా దాడి చేసి గాయపరిచాడు. గాయపడిన ముగ్గురిని జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్సలు చేయిస్తున్నారు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా యోగాంధ్ర కార్యక్రమం

**జమ్మలమడుగు, జూన్ 1, ప్రభాతవార్త:**

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం జమ్మలమడుగు పురపాలక సంఘం నందు ఉన్న ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ నందు మున్సిపల్ కమిషనర్ కె.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా యోగాంధ్ర కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జమ్మలమడుగు ఆర్డీవో ఆదిమూలం సాయిశ్రీ, ఎమ్మార్వో శ్రీనివాస్‌రెడ్డి, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

## చౌక దుకాణాల ద్వారా సరుకులను పంపిణీ



**కురబలకోట, జూన్ 1 ప్రభాతవార్త**

నియోజకవర్గం టిడిపి ఇంచార్జి శ్రీ దాసరపల్లి జయచంద్ర రెడ్డి గారి ఆదేశాల మేరకు, తంబళ్లపల్లి నియోజకవర్గం సమన్వయ కర్త మల్లికార్జున నాయుడు సూచన మేరకు కురబల కోట మండలం,ముదివేడు షాప్ నంబర్ 20 నందు ప్రజలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో తెలుగు యువత ప్రధాన కార్యదర్శి ఆయుబ్, తెలుగు యువత అధ్యక్షలు శ్రీనాథ్ రెడ్డి, పార్లమెంట్ కార్యదర్శి పూస మోహన్ రెడ్డి,ముదివేడు SMC చైర్మన్ భావ జాన్, అబ్జాల్, లోకేష్, హరి,ఇందాద్ మరియు ముదివేడు కూటమి నాయకులు పాల్గొని ప్రజలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేయడం జరిగింది.

## ఆటోల మీద పిసి నెంబర్ తప్పనిసరిగా ఉండాలి

**బద్వేల్ అర్బన్ జూన్ 01 ప్రభాతవార్త :**

బద్వేల్ పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఆదివారం సాయంత్రం అర్బన్ సీఐ రాజగోపాల్ తమ పోలీస్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు, ఈ సందర్భంగా సిఐ రాజగోపాల్ మాట్లాడుతూ బద్వేల్ ప్రాంతంలో తిరిగే ఆటో వారు ప్రతి ఒక్కరు ఆటోపై పి,సీ నెంబర్ తప్పనిసరిగా ఉండాలన్నారు, ఆటో డ్రైవర్ ప్రతి ఒక్కరు యూనిఫామ్ ధరించి ఆటోలు నడపాలన్నారు, రోడ్లపై ఎక్కడపడితే అక్కడ నిలిపి ట్రాఫిక్ అంతరానికి గురవుతే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు, ప్రయానికులు ను ఎక్కించుకునేటప్పుడు దించేటప్పుడు నెమ్మదిగా చూసుకొని వాహనాలను నడపాలన్నారు, వాహనాలకు సంబంధించిన రికార్డును ఎప్పటికప్పుడు సరి చుసుకుంటూ ఉండాలన్నారు, డ్రైవింగ్ లైసెన్స్ ఆర్ సి లాంటివి లేకపోతే వారిపై జరిమానా తప్పదన్నారు,

అనంతరం పలువురు ఆటో వారికి పోలీస్ చట్టాల గురించి వివరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు, ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటసుబ్బయ్య, పోలీస్ సిబ్బంది నాగరాజా, ప్రసాద్, ప్రకాష్ తోపాటు పలువురు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం ఘోర వైఫల్యం



**వేంపల్లి: జూన్ 01 (ప్రభాత వార్త):**

రాష్ట్రంలో విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించడంలో టిడిపి కూటమి,వైకాపా దొందూ దొందే అని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్. తులసి రెడ్డి అన్నారు. ఆదివారం వేంపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పాలనలో పాటశాల విద్యలో మూడు రకాల పాఠశాలలు వుండేవి విద్యార్థులకు, తల్లిదండ్రులకు,ఉపాధ్యాయులకు అందరికీ అనుకూలంగా వుండేవని అన్నారు. వైకాపా ప్రభుత్వం ఆరు రకాల పాటశాలలుగా చేసింది.టిడిపి కూటమి ప్రభుత్వం తొమ్మిది రకాలుగా చేసింది.అందరికీ అయోమ యం, గందరగోళం అన్నారు.జగన్ ప్రభుత్వం పాఠశాల విద్య లో తెలుగు మాధ్యమం రద్దు చేస్తూ జీవో 85 జారీ చేసింది.ఇది ఒక చారిత్రిక తప్పిదం. తాము అధికారంలోకి వస్తె పై జీవో ను రద్దు చేస్తామని టిడిపి కూటమి ప్రజలకు హామీ ఇచ్చింది. అధికారం లోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా జీవో 85 రద్దు కాలేదు.ఏ దేశం లో గానీ,ఏ రాష్ట్రం లో గానీ ఈ పరిస్థితి లేదు.పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు ,ఒరిస్సా తదితర రాష్ట్రాల్లో తెలుగు మాధ్యమం పాఠశాలలుండగా తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన ఆంధ్ర ప్రదేశ్ లో, పార్టీ పేరులోనే తెలుగు దేశం అని వున్న పార్టీ పాలనలో పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమం లేక పోవడం విడ్డూరం.సిగ్గుచేటు. ఎన్‌టీఆర్ ఆత్మ క్షోభిస్తుంది.టిడిపి పేరును ఇంగ్లీష్ దేశం గా మార్చడం సమంజసంగా ఉంటుంది. పదవ తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం లో కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందింది.66,463 మంది విద్యార్థులు రీకౌంటింగ్ కు లేదా రీ వాల్యుయేసన్ కు అప్లై చేసుకోగా 11175 మంది మార్కుల్లో తేడా రావడం గమనార్హం. నెల్లూరు జిల్లా కు చెందిన రామి శెట్టి సాయి కుందనకు 34 మార్కులు రాగా రీవాల్యూ యేసన్ తర్వాత 93 మార్కులు వచ్చాయి.దీనిని బట్టి మూల్యాంకనం ఎంత అస్తవ్యస్థంగా జరిగిందో అర్థమవుతోంది. విద్యార్థి జీవితం లో పదవ తరగతి కీలకం.అక్కడ తప్పులు జరిగితే విద్యార్థులు,వారి తల్లి దండ్రులు తీవ్ర మానసిక క్షోభకు గురి ఔతారు. విద్యా శాఖ మంత్రి గా లోకేష్ పూర్తి వైఫల్యం చెందాడు.ఇందుకు గాను లోకేష్ తనకు తానుగా భాధ్యత వహించి మంత్రి పదవికి రాజీనామా చేయాలి.లేకుంటే ముఖ్య మంత్రి లోకేష్ ను మంత్రి వర్గం నుండి తప్పించాలి లేదా శాఖ నైనా మార్చాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు.

## రేషన్ సరుకుల పంపిణీ

**కలికిరి, జూన్ 1, ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలంలోని 14 పంచాయతీలకు సంబంధించి 34 చౌక దుకాణాలలో ఆదివారం కలికిరి మండల తహసీల్దార్ మహేశ్వరీభాయ్ పర్యవేక్షణలో పండగ వాతావరణం మధ్య రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. 14 గ్రామ పంచాయతీలలో ఆయా పంచాయతీ ప్రజా ప్రతినిధులు, తెదేపా నాయకులు, రెవెన్యూ అధికారులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలికిరి పంచాయతీ కె.రెడ్డివారిపల్లి గ్రామంలోని చౌకదుకాణంలో రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ మహేశ్వరీభాయ్ ప్రారంభించారు. కలికిరి క్రాస్ వద్ద ఉన్న చౌకదుకాణంలో తెదేపా సీనియర్ నాయకులు రవికుమార్ యాదవ్, నాయకులు మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. మర్రికుంటపల్లె పంచాయతీలో స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్, తెదేపా సీనియర్ నాయకులు ఎం.ఆనందరెడ్డి, చిన్నరెడ్డయ్య, వెంకటపతిలు ప్రారంభించారు. పత్తేగడ పంచాయతీ కొట్టాల గ్రామం చౌకదుకాణంలో రాజంపేట పార్లమెంటు జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు వాసనూరి చంద్రశేఖర్ తనయుడు నిఖిల్, టీడీపీ సీనియర్ నాయకులు కొటాల చల్లయ్యలు ప్రారంభించారు. గడి చౌకదుకాణంలో తెదేపా సీనియర్ నాయకులు ఇస్మాయిల్ రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు సురేష్‌కుమార్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, శిల్ప కుమారి, ఆదిలక్ష్మి, గౌరీ, దశరథ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



## వాహణం ఢీకొని వ్యక్తి మృతి...

**ఖాజీపేట, జూన్ 01, ప్రభాతవార్త:**

ఖాజీపేట బైపాస్ రోడ్డు మార్గాన పత్తూరు గ్రామ సమీపాన గుర్తు తెలియని వాహణం ఢీకొని ఒక వ్యక్తి మరణించాడు. సీఐ మోహన్ కథనం ప్రకారం బద్వేలు నియోజికవర్గం గోపవరం మండలం వెల్లవారి పల్లి గ్రామానికి చెందిన భాస్కర్ అనే వ్యక్తి అగ్రహాంలో జరుగుతున్న అంకాలమ్మ తిరునాల జాతరకి బంధువుల ఇంటికి తన ద్విచక్ర వాహణంలో వచ్చే క్రమంలో ఖాజీపేట కడప బైపాస్ పత్తూరు సమీపాన గుర్తు తెలియని వాహణం ఢీకొట్టడంతో ద్విచక్ర వాహణం దగ్ధం అయి భాస్కర్ అక్కడికక్కడే మృతి చెందాడు. కానీ అక్కడి మృతదేహాన్ని గమనించని వాహణాలు మృతదేహం మీదుగా పయనించడంతో మృతదేహం ఛిద్రమైంది. మృతునికి భార్య నాగేశ్వరమ్మ మరియు ఒక కుమారుడు ఉన్నాడు. భార్య నాగేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.

## వైభవంగా అంకాలమ్మ జాతరలు



**ఖాజీపేట, జూన్ 01, ప్రభాతవార్త:**

మండలంలోని కె.అగ్రహారం మరియు తుడుములదిన్నే గ్రామాల్లో అంకాలమ్మ జాతరలు వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుండి భక్తులు అమ్మవారికి బోనాలను సమర్పించి పొట్టేళ్లను బలి ఇచ్చారు. ఇరు గ్రామాల్లో దాదాపు ప్రతి ఇంటిలో పొట్టెళ్లను బలి ఇచ్చి బంధుమిత్రాదులను పిలిచి విందు భోజనాలను ఏర్పాటు చేయడంతో పల్లెలు మొత్తం పూర్తి పండుగ వాతావరణం నెలకొంది. అగ్రహారంలో ఖాజీపేట ఎంపీటీసీ జంగిటి శివప్రసాద్ ముందుగా అంకాలమ్మ తల్లికి దున్నపోతును బలి ఇచ్చారు. ముందుగా అంకాలమ్మ తల్లికి బలి ఇచ్చే పోతుని గ్రామం అంతా డప్పు వాయిద్యాల మధ్య మెరవనిగా ఊరేగిస్తూ వచ్చిన పిమ్మట తల్లికి సమర్పించారు. గ్రామస్థులు అమ్మవారికి బోనాలు, నైవేద్యాలు, బలులు సమర్పించారు.

## విద్యుత్ బకాయిలు చెల్లించండి

**దువ్వూరు, జూన్ 01, ప్రభాతావార్త:**

మండల పరిధిలో వివిధ కేటగిరీలకు సంబంధించి అధికంగా విద్యుత్ బకాయిలు ఉన్నాయని వాటిని చెల్లించాలని ట్రాన్స్‌కో ఏఈ రాజ్‌కుమార్ అన్నారు. మం డలంలో ముఖ్యంగా వ్యవసాయ రంగంలోని రైతులు అధిక మొత్తాలు చెల్లించవలసి ఉందని వాటి కొరకు ఈ నెల 3వ తేది నుండి ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశామని వారంలో మూడు రోజుల పాటు గ్రామంలోనే ఉండి విద్యుత్ బకాయిలు వసూలు చేయాలన్నారు. ఆ టీంలకు బకాయిలు ఉన్న వారు తమ బకాయిలు చెల్లించి సంస్థను పడిపించాలన్నారు. అలా చెల్లించకపోతే విద్యుత్ సర్వీసులు తొలగిస్తామని పేర్కొన్నారు. అటువంటి సమస్య రాకుండా విద్యుత్ వినియోగదారులు చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## రేషన్ పంపిణీ మొదలు

**దువ్వూరు, జూన్ 01, ప్రభాతవార్త:**

ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన చౌక దుకాణాల వద్దనే రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ఆయా చౌక దుకాణాల వద్ద గ్రామ రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో పంపిణీని మొదలు పెట్టారు. గతంలో వాహణం ద్వారా ఇంటింటికి వెళ్లి పంపిణీ చేసే వారని ఆ వ్యవస్థను ప్రభుత్వం స్వస్తి చెప్పిందని ప్రస్తుతం డీలర్ ఇంటి వద్దకే వెళ్లి బియ్యం, చక్కెర వంటి రేషన్ సరుకులను తెచ్చుకునే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆదివారం చౌక దుకాణాల వద్ద అట్టహాసంగా ఈ కార్యక్రమాన్ని చౌక దుకాణపు డీలర్లు ప్రారంభించి వినియోగదారులకు తమ వద్ద ఉన్న బియ్యం, చక్కెరను పంపిణీ చేశారు.

## రీ వెరిఫికేషన్లో మార్కుల అధికం.

**వేంపల్లి:జూన్:01:(ప్రభాత వార్త)**

2025 సం॥ మార్చిలో జరిగిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో వేంపల్లి శ్రీచైతన్య విద్యార్థులు మంచి మార్కులు సాధించారు. వారిలో బి. సాయినాథ్ కి 597/600 మార్కులు రాగా, శి. గురు భావనకు 595/600 మార్కులు 592,592, 589, 587, 586, 585 మార్కులు విద్యార్థులు సాధించారు. విద్యార్థులు పరీక్షలు బాగా రాసినా తక్కువ మార్కులు వచ్చాయని వారి తల్లిదండ్రులు రీవెరిఫికేషన్ కు అప్లై చేసినారు. వారిలో బి. గౌతమ్ రెడ్డికి సాంఘిక శాస్త్రంలో 8 మార్కులు పెరిగి 569 మార్కులు వచ్చాయి. రీ. భాండవ్ రెడ్డికి సాంఘిక శాస్త్రంలో 1 మార్కు పెరిగి 556 మార్కులు వచ్చాయి. రీవెరిఫికేషన్లో మార్కులు పెరగడంతో విద్యార్థుల తల్లి దండ్రులు, పాఠశాల యాజమాన్యం వారు హర్షం వ్యక్తం చేశారు.

## రైతు బజార్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**వేంపల్లె :జూన్ 01:(ప్రభాత వార్త)**

వేంపల్లెలోని రోడ్డు భవనాల శాఖ అతిథి గృహం సమీపంలో ఉన్న రైతు బజార్ ను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం రైతు బజార్ ను సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు ప్రారభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసిన కూరగాయలను విక్రయించుకొనేందుకు గత వైసిపి ప్రభుత్వం పాలనలో 1.20 కోట్లతో రైతు బజార్ ను నిర్మించడం జరిగిందని చెప్పారు. ఇప్పటికి వరకు కడప రోడ్డులో ఉన్న కూరగాయల మార్కెట్ ను ప్రజల సౌకర్యార్థం కోసం రైతు బజారులోకి మార్చడం జరిగిందని కాబట్టి ప్రజలందరూ రైతు బజార్ లో ఉన్న తాజా కూరగాయలను కొనుగోలు చేయాలని కోరారు. రైతు బజార్ లో విక్రయించే కూరగాయలను సరసమైన ధరలకు, నాణ్యత కలిగిన కూరగాయలను విక్రయాలు చేపట్టాలని చెప్పారు. రైతులు పండించిన ఉత్పత్తులను విక్రయాలు చేసుకొనేందుకు రైతు బజార్ లో మౌలిక సదుపాయాలు కూడ కల్పించినట్లు చెప్పారు. వర్ష కాలంలో కూడ కూరగాయలు విక్రయాలు చేసే రైతులకు ఇబ్బందులు తొలిగి పోతాయాని చెప్పారు. రైతు బజారు వినియోగం లోకి రావడంతో ప్రజలు కూడ హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఈకార్యక్రమంలో వార్డు మెంబరు ముత్యాల ఆంజనేయులు, వైసీపీ నేత కసిరెడ్డి ఆది నారాయణ రెడ్డి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్, దొంతు సుమన్, చంద్రా, వెంకట రమణారెడ్డి, వ్యాపారస్తులు, పాల్గొన్నారు.

## గీతా ఖపఠనం దివ్యమైన జీవితానికి సోపానం

**ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 1 ప్రభాతవార్త :**

విద్యార్థులు చిన్నతనం నుంచి భగవద్గీతను నేర్చుకుంటే దివ్యమైన జీవితానికి సోపానాలుగా మారుతుందని ప్రముఖ కవి జింకా సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఆదివారం గీతాశ్రమం రోడ్డులో గల బ్రహ్మశ్రీ వేదాంతం లక్షణాచార్యుల ఆశ్రమలో నెల రోజులుగా జరిగిన భగవద్గీత క్లాసులలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మాతృశ్రీ రత్నమ్మ ఆధ్వర్యంలో నెల రోజులు పాటు జరిగిన భవద్గీత శిక్షణ శిబిరంలో వారు 12 ఆధ్యాయంలో శ్లోకాలను నేర్పించారు, సభకు మాతృశ్రీ రత్నమ్మ అధ్యక్షత వహిస్తూ భగవద్గీత అన్ని ప్రశ్నలకు సమాధ్నాన ఇస్తుందని విజ్ఞాన మార్గంలో నడిపిస్తుందని శ్లోకాలు నేర్చుకోవడం ద్వారా శోకాలు దూరం అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా చార్టెడ్ అకౌంటెంట్ సాధు గోపాలకృష్ణ, మధుసూదన్ రెడ్డి రాధమ్మ కృష్ణ చైతన్య పాల్గొన్నారు విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమాన్ని మచ్చ ప్రభాకర్ అవ్వరు దేవి ప్రసాద్, గుర్రం శివ పర్యవేక్షించారు.



## నేడు పీలేరు ఏఎంసీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్న పురం రామమూర్తి



**పీలేరు జూన్ 1 ప్రభాతవార్తః**

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పురం రామమూర్తి, డైరెక్టర్లు సోమవారం ప్రమాణ స్వీకారం చేసి పదవి బాధ్యతలు చేపట్టనున్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్టీ కోసం అంకితభావంతో కష్టపడి పని చేసే కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీలోనే మంచి గుర్తింపు సాధ్యమని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. అలాగే మంత్రి నారా లోకేష్ తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుల సంక్షవానికి ఎంతో కృషి చేస్తున్నరని అన్నారు. తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ మంచి గుర్తింపు ఉంటుందనడానికి నామినేటెడ్ పదవుల పంపిణీనే ఒ నిదర్శనం అని గుర్తు చేశారు. అలాగే పీలేరు శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి కూడా కార్యకర్తల సేవలను గుర్తించి వారికి ప్రత్యేక గుర్తింపు, అవకాశాలు కల్పిస్తున్నారని అన్నారు. పీలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ గా తాను, మరో 14 మంది డైరెక్టర్లు సోమవారం ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి నేతృత్వంలో ప్రమాణ స్వీకారం చేయనున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి టిడిపి శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు, ఇతర నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ అధిక సంఖ్యలో తరలివచ్చి, ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

## ప్రవీణ్ రెడ్డి కి వన్ ప్లస్ వన్ భద్రత కేటాయింపు



**ప్రొద్దుటూరు జూన్ 1 ప్రభాతవార్త**

ప్రొద్దుటూరు టిడిపి మాజీ ఇంచార్జ్ డాక్టర్ జివి ప్రవీణ్ కుమార్ రెడ్డికి వన్ ప్లస్ వన్ గన్మెన్ల భద్రతను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా ఎస్పీ ఆ మేరకు గన్మెన్లను భద్రత కల్పిస్తూ ఆదివారం విధులలో చేరారు. గత ఎన్ని కల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక స్తబ్ధత గా ఉన్న ప్రవీణ్ కు మహానాడు అనంతరం గన్మెన్ల కేటాయింపు పై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తమ అభిమాన నాయకుడు డాక్టర్ జీవీ ప్రవీణ్ కుమార్ రెడ్డి రాష్ట్ర పెద్దలతో ముఖ్యంగా యువనేత నారా లోకేష్ తో టచ్‌లో ఉన్నారని అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గన్మెన్ల కేటాయింపు పై ప్రవీణ్ అభిమానులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## చిరుధాన్యాలతో పోషక మరియు ఆరోగ్య భద్రత



**బ్రహ్మంగారిమఠం జూన్ 1 ప్రభాతవార్త**

వికసిత కృషి సంకల్ప అభియాన్ బ్రహ్మంగారిమఠం మండలంలోని మల్లేపల్లి సోమిరెడ్డిపల్లి పలుగురాళ్లపల్లి గ్రామపంచాయతీలో చిరుధాన్యాల పోషక మరియు ఆరోగ్య భద్రత అంశం ఆధారంగా కార్యక్రమం నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త మరియు అధిపతి బాలకృష్ణ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించారు జాతీయ చిరుధాన్యం పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ బి సుబ్బరాయుడు మాట్లాడుతూ చిరుధాన్యాల రకాలు వాటి లక్షణాలు యాజమాన్య పద్ధతులు విలువ ఆధారిత జోడింపు చేయడం చీడపీడల నివారణ అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు మరో శాస్త్రవేత్త డాక్టర్ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ రైతులు పంటలను సాగు చేసే ముందు తమ పొలంలో మట్టి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించి అందులో వచ్చే ఫలితాలను బట్టి సాగు చేసే పంటలకు పోషకాలను అందించాలన్నారు. కెవికె శాస్త్రవేత్త డాక్టర్ ఫిరోజ్ ఖాన్ మాట్లాడుతూ దానిమ్మ,మిరప,అరటి,నిమ్మ బత్తాయి పంటల యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. మొక్కలను ఎక్కడపడితే అక్కడ కొనుగోలు చేయకుండా నాణ్యమైన మొక్కలను కొనుగోలు చేసి మంచి దిగుబడులు సాధించాలన్నారు. అనంతరం వివిధ రకాల పంటలకు సంబంధించిన కరపత్రాలను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాసులు రెడ్డి వ్యవసాయ శాఖ అధికారి ప్రవీణ్, గ్రామ వ్యవసాయ సహాయకుడు సాయి కుమార్, భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు చంద్ర ఓబులరెడ్డి, మల్లె పల్లె సర్పంచ్ భర్త నారాయణ, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి రైతు సంఘం అధ్యక్షుడు ఊటుకూరు సిద్ధారెడ్డి, రైతు సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

**ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 1, ప్రభాతవార్త ;**

చదువు విచక్షణా జ్ఞానం అందిస్తుందని కదిరి ఎమ్మెల్యే వెంకట ప్రసాద్ తెలిపారు. ఆదివారం స్థానిక గీతాశ్రమం వీధిలోని పద్మశాలీయ కళ్యాణ మండపంలో బిసి ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 15వ బిసి విద్యార్థుల ప్రతిభా పురస్కార పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు విచక్షణా జ్ఞానాన్ని అందిస్తుందని, చదువు ద్వారా సంగ్రహణాశక్తిని లభిస్తుందని వివరించారు. విద్యార్థులకు తల్లిదండ్రులే మార్గదర్శి అని తెలిపారు. తమ తరానికి టెక్నాలజీ అంతగా అందుబాటులో లేదని, కానీ ప్రస్తుతం విద్యార్థులకు టెక్నాలజీ చాలా బాగా అందుబాటులో వుందని, ఆ టెక్నాలజిని అందిపుచ్చుకుని అభివృద్ధి చెందాలని సూచించారు. తల్లిదండ్రులు వారి పిల్లలను మంచి మనుషులుగా తీర్చి దిద్దాలని, వారికి వెనుకబాటు తనాన్ని దరిచేయనీయరాదని సూచించారు. తాను చిన్నారులతో ఇలాంటి విషయాలు పంచుకోవాలనే ఈ కార్యక్రమంలో పాల్గొన్నానని వివరించారు. అనంతరం మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలని తెలిపారు. విజయం ఎవ్వరికీ ఒక్కసారిగా రాదని, ఒక్కో మెట్టు ఎక్కుతూ విజయాన్ని ఆత్మవిశ్వాసంతో చేరుకోవాలని సూచించారు. ఉదాహరణకు తన విషయమే తీసుకుంటే తాను చిన్నతనంలోనే ఐఏఎస్ కావాలని లక్ష్యాన్ని నిర్దేశించుకొన్నానని, దాని కోసం ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని, అకుంఠిత దీక్షతో ముందుకు సాగి చివరికి ఈ లక్ష్యం సాధించానని వివరించారు. తల్లిదండ్రులు విద్యార్థులకు ఇష్టం లేని రంగాన్ని వారిపై రుద్దకుండా, వారికి ఇష్టమైన రంగంలోనే వారు అభివృద్ధి చెందేలా వారిని ప్రోత్సహించాలని తెలియజేశారు విద్యార్థులు కూడా ఉన్నత స్థాయికి ఎదిగిన అనంతరం సమాజాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కాగా కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ప్రముఖులు మాట్లాడుతూ బిసి లు ఐకమత్యంగా వుండి సమస్యలు పరిష్కరించుకొని రాజ్యాధికారానికి చేరువ కావాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థి దశలో క్రమశిక్షణతో వుంటూ తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. యువతను తల్లిదండ్రులు రాజకీయాల్లో కూడా రాణించేలా ప్రోత్సహించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా 10, ఇంటర్, ఈఏపీ సెట్, నీట్, జేఈఈ లో ప్రతిభ కనబరిచిన దాదాపు 76 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 3000 రూపాయలను పురస్కారాల రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు బత్తల వెంకటసుబ్బయ్య, బత్తల లింగమూర్తి, కొండయ్య, బడిగించల చంద్రమౌళి, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ మండ్ల మల్లికార్జునరావు, జిసి పుల్లయ్య, బిసి ప్రజా చైతన్య సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.



# డీలర్ షాపుల్లోనే రేషన్ బియ్యం పంపిణీ

పెద్దమండెం జూన్ 1 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు తిరిగి డీలర్ షాపుల్లోనే పీఎం పంపిణీ కార్యక్రమాలను ఆదివారం కట్టహాసంగా చేపట్టారు గత ప్రభుత్వం నిర్వహించిన ఇంటి వద్దకే బియ్యం కార్యక్రమం ప వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఉద్దేశంతో ఆ కార్యక్రమానికి స్వస్తి పలికి తిరిగి రేషన్ షాపుల్లోనే బియ్యం చక్కెరను పొందాలని ప్రభుత్వం ఆదేశించింది దీనికి ఆదివారం డీలర్లు రేషన్ బియ్యం పంపిణీ జరిపారు అలాగే నడవలేని వారికి 65 సంవత్సరాలు దాటిన వృద్ధులకు ఇంటి వద్దకే బియ్యం పంపిణీ చేస్తున్నట్లు డీలర్లు శ్రీరాములు వలి పేర్కొన్నారు ప్రతినెల 15 రోజుల వరకు బియ్యంలో ఎప్పుడైనా తీసుకోవచ్చని అన్నారు గతంలో పనులు మానేసి రేషన్ బియ్యం బండి కోసం ఎదురుచూపులు చూడాల్సిన అవసరం ఉండేది ఎప్పుడు వస్తుందో తెలియక రాత్రుల్లో పడిగాపులు కాసేవారు ఆ విధానానికి స్వస్తి పలికి కూటమి ప్రభుత్వం తిరిగి డీలర్ షాపుల్లోనే పొందే విధంగా విధంగా చర్యలు చేపట్టింది దీనికి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు హాస్యం షాప్ పోలిశెట్టి సుబ్బయ్య మండల యువ నాయకుడు గంగాధర రైతు విభాగం అధ్యక్షుడు మహేశ్వర తెలుగుదేశం నాయకుడు బిటెక్ సుమన్ జనసేన నాయకులు అష్రాఫ్ నాగూర్ వలి ధనుంజయ ప్రకాష్ రెడ్డి


నిత్యవసర వస్తువులు పంపిణీ చేస్తున్న డీలర్

హర్ష నాయకులు చిన్న రెడ్డి భాష మస్తాన్ లక్ష్మీనారాయణ ఉదయ్ కుమార్ చలపతి నాయుడు లక్ష్మీనారాయణ సూరిబాబు నాగయ్య అంజి మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ వేరైనా ప్రజా పంపిణీ వ్యవస్థే ముఖ్యం

### ఆకేపాడులో రేషన్ సరుకులు అందించిన ఆకేపాటి

రాజంపేట అర్బన్, జూన్1 ప్రభాతవార్త

పార్టీ వేరైనా ప్రభుత్వ విధాన నిర్ణయాలతో ప్రజలకు కొత్త వ్యవస్థ ప్రారంభించడం తెలియాలని అన్నమయ్య జిల్లా వైసీపీ అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి ఆదివారం ఆకేపాడులోని చౌక దుకాణంలో రేషన్ సరుకులు పంపిణీని రాజంపేట తాసిల్దార్ పీర్ మున్నీ తో కలిసి ఆయన నిత్యావసర సరుకుల పంపిణీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ శేషం రాజు, స్థానిక డీలర్, స్థానికులు పాల్గొన్నారు.



## లాంఛనంగా రేషన్ షాపులు ప్రారంభం



పెనగలూరు జూన్ 1 ప్రభాతవార్త

మండలంలో ఉన్న రేషన్ షాపుల నుండి ప్రజలకు బియ్యం తదితర నిత్యవసర వస్తువులు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఆదివారం తాసిల్దారు అమరేశ్వరి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు లాంచనంగా షాపులు పునః ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. పెనగలూరు పంచాయతీలోని 4 ,5, 6 రేషన్షాపుల ప్రారంభోత్సవంలో బిఎల్ నరసింహారెడ్డి, కే బాలకృష్ణ, ఎన్ రాంప్రసాద్ నాయుడు, జి రామయ్య, పున్నాటి సుబ్బారెడ్డి, ఏ చిన్న, జి పెంచలయ్య, జిఎంఆర్, పి వెంకటరమణ, కే వాసు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయురాలిగా షేక్ షకీరా బేగం



సుండుపల్లి, జూన్ 1, ప్రభాతవార్త:

మే నెలలో జరిగిన ప్రధానోపాధ్యాయుల పదోన్నతులలో పదోన్నతి పొంది నేడు సుండుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ప్రధానోపాధ్యాయురాలిగా షేక్. షకీరా బేగం బాధ్యతలు స్వీకరించారు. శ్రీమతి షకీర బేగం మాట్లాడుతూ పాఠశాల సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరమణ, హరికుమార్, విజయ్ కుమార్, శంకర్ నాయక్, పద్మావతి, రాజేశ్వరి, నాగేంద్ర, రామ్మోహన్, విశ్వనాథ్, రవీంద్ర నాయక్ మొదలగు వారు పాల్గొన్నారు.

## కార్పొరేట్ పాఠశాలలకు విద్యాశాఖధికారుల వత్తాసు

ఎద్యుకేషన్ జూన్ 1 ప్రభాతవార్త :



కడప,అన్నమయ్య జిల్లాలో కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలు యాజమాన్యములు పాఠశాల విద్యాశాఖ నిబంధనలు విరుద్ధంగా విచ్చలవిడిగా అక్రమంగా అడ్మిషన్స్ నిర్వహించారని పలు మార్లు విద్యాశాఖధికారులకు పిర్యాదు చేసిన వారికే వత్తాసు పలుకుతున్నారని పిడియస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న ఆరోపించారు. ప్రొద్దుటూరు, పులివెందుల, బద్వేల్, రాయచోటి, రైల్వేకోడూరు, మదనపల్లి ప్రాంతాల్లో వున్నా కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు యాజమాన్యాలు పాఠశాలలు ప్రారంభం కాకమునుపే ఇప్పటికే 60 శాతం అడ్మిషన్స్ పూర్తి చేశారని, అడ్మిన్‌కు వచ్చే విద్యార్థి చేత నిబంధనలుకు విరుద్ధంగా అడ్మిషన్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నారని, కేవలం నర్సరీకే 30 వేల రూపాయలు నుండి 40 వేల రూపాయలు వరకు తల్లిదండ్రుల దగ్గర నుండి వసూలు చేస్తున్నారని అదేవిధంగా పలు పాఠశాలలు సిబిఎస్ఈ సిలబస్ లేనపప్పటికీ ఉన్నట్లు ప్రచారం నిర్వహిస్తున్నారని,గుర్తింపు లేని పాఠశాల వివరాలు విద్యాశాఖ అధికారులు పత్రికలకు తెలియచేయాలన్నారు. కావున ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పిడియస్ యు ఉమ్మడి జిల్లా నాయకులు అఖిల్ నాయుడు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజలకు పట్టిన గ్రహణం చంద్రబాబు

ప్రొద్దుటూరు జూన్ 1 ప్రభాతవార్త

గత సంవత్సరం జూన్ 4న రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో మోసం చేసి రాష్ట్రానికి గ్రహణం రూపంలో చంద్రబాబు పట్టిపీడిస్తున్నారని ఆ గ్రహణాన్ని విడగొట్టి ప్రజలకు వెలుగులు నింపేందుకే వెన్నుపోటు దినం జూన్ 4ననిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన జూన్ 4న చేపట్టే వెన్నుపోటు దినం గోడ పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి జూన్ 4 కు సంవత్సరకాలం పూర్తయిందని ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా చంద్రబాబు మోసం చేస్తున్నారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలతో పాటు 163 హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు ప్రతి మహిళకు 1500 నిరుద్యోగులకు 3000 మృతి తల్లికి వందనం ఫ్రీ బస్సు లాంటి పథకాలను తుంగలో తొక్కి సంవత్సరం కాలం పాటు పాలన కొనసాగించారని విమర్శించారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు సంక్షేమ పథకాలు తక్షణమే కాకుండా గత సంవత్సరానికి కూడా కలిపి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా జూన్ 4న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సంక్షేమ పథకాల అమలు విషయంలో ఈ నాలుగు సంవత్సరాలు అమలు చేసినా సరిపోతుందని ప్రజలు ఒప్పుకున్నా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం ఐదు సంవత్సరాలు ప్రజలకు ఇచ్చిన సంక్షేమ వాగ్దానాలు అమలు చేసేంతవరకు పోరాటం చేస్తుందన్నారు.



ఏడాది గడిచిన ఏమాత్రం ప్రజలకు మేలు చేయని కూటమి ప్రభుత్వం తెలుగుదేశం పార్టీ మహానాడు ను నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందన్నారు కడపలో జరిగిన మహానాడులో గొప్పలు చెప్పుకోవడం తప్ప ప్రజలకు మరేమీ మేలు జరగలేదన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా చేపట్టే వెన్నుపోటు దినం కార్యక్రమానికి నియోజకవర్గంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు వేలాదిగా తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్షేమ పథకాలను దూరం చేసిన మహిళలను ఈ నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనేలా కృషి చేయాలని వైసిపి నాయకులకు కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆప్కాబ్ మాజీ చైర్ పర్సన్ మల్లెల ఝాన్సీ మండల అధ్యక్షులు సానబోయిన శేఖర్ యాదవ్ రాజుపాలెం మండలం వైసీపీ కన్వీనర్ బానా కొండారెడ్డి పట్టణ అధ్యక్షులు భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి ప్రచార కార్యదర్శి కల్లూరు నాగేంద్రారెడ్డి వైసీపీ నాయకులు నల్లదేసి జంగమయ్య డీలర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ షాపును ప్రారంభించిన తాసిల్దార్

సుండుపల్లి, జూన్ 1, ప్రభాతవార్త:



సుండుపల్లి మండల కేంద్రంలో అఫ్జల్ రేషన్ షాప్ నెంబర్ 9 లో తాసిల్దార్ దైవదినం ప్రారంభించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మరియు కూటమి నాయకులు మాట్లాడుతూ రేషన్ షాపు డీలర్లు ప్రభుత్వా నియమ నిబంధనల ప్రకారం కార్డుదారులకు రేషన్ పంపిణీ చేయాలన్నారు. రేషన్ పంపిణీకి సంబంధించి తూకంలో తేడాలు లేకుండా ఖచ్చితమైన తూకంతో బియ్యం ఇవ్వాలన్నారు. ఇక నుండి ప్రతి నెల 1 వతేదీ నుంచి 15 వరకు ప్రతి రోజు ప్రభుత్వం నిర్దేశించిన సమయాల్లో ఉదయము 8.00 నుండి 12.00 గంటల వరకు మరియు సా. 4.00 గంటల నుండి 8.00 గంటల వరకు ఎఫ్. పి. షాపులను తెరిచి ఉంచాలని రేషన్ డీలర్లకు ఆదేశించారు. ఎఫ్.పి. షాప్ నెం. పని వేళలు ధరలు, సరుకు నిల్వను సూచించే బోర్డును తప్పని సరిగా డిస్ప్లే చేయాలన్నారు.

## నేడే దండోరమ్మ తిరుణాల మహోత్సవం..

సుండుపల్లి, జూన్ 1, ప్రభాతవార్త :



మండల పరిధిలోని ఎర్రమనేని పాలెం గ్రామం వద్ద వెలిసిన దండోరా మా తిరుణాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు ఉదయాన్నే ప్రత్యేక పూలు, పట్టు వస్త్రాలు మరియు బంగారు ఆభరణాలతో అలంకరించి అభిషేకములు మరియు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గావు పట్టుట, పుట్ట బంగారు తెచ్చి పూజించడంతోపాటు పొంగు పాలు తెచ్చి పొంగ పెట్టడం, సిద్దులకు ఒక్కపొద్దు వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కుబడుల్లో భాగంగా రాత్రి డప్పు వాయిద్యాలతో కోలాటాలతో బాణసంచా కాలుస్తూ రంగురంగుల విద్యుత్ దీపాలంకరణ తో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసేందుకు చాందిని బండ్లు ఏర్పాటు చేశారు.

## ప్రజల సౌకర్యార్థం కోసం

# రేషన్ షాపుల దగ్గరే పంపిణీ



గాలివీడు, జూన్ 1(ప్రభాతవార్త):

ప్రజల సౌకర్యార్థం కోసం రేషన్‌షాపుల దగ్గరే వివిధ రకాల సరుకులను పంపిణీ చేయడం జరుగుతుందని తహసీల్దార్ భాగ్యలత పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని బోరెడ్డిగారిపల్లెలో పూలికుంట సర్పంచ్ పార్థసారథిరెడ్డితో కలిసి రేషన్‌షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1వ తేదీ నుండి 15వ తేదీల వరకు ఎప్పుడైనా ఎక్కడైనా ప్రజలు వారి సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని రేషన్ సరుకులను తీసుకొని వెళ్లవచ్చని తెలిపారు. రేషన డీలర్లు కూడా 15వ తేదీ వరకు ప్రజలకు అందుబాటులో ఉండి వారికి ఎప్పుడు కా వాలంటే అప్పుడు సరుకులను అందజేయాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 1వ తేదీ నుంచి రేషన్ షాపుల దగ్గరే సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలని తలంచిందన్నారు. అం దులో భాగంగా మండల వ్యాప్తంగా ఆదివారం 38 రేషన్‌షాపుల పరిధిలో షా పుల దగ్గర బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

## బలిజ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకే...



జమ్మలమడుగు, జూన్ 1, ప్రభాతవార్త:

ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో వివిధ వృత్తుల్లో పనిచేస్తున్న బలిజ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి శ్రీకృష్ణదేవరాయ ఉద్యోగ జేఏసీ సంఘం కృషి చేస్తుందని సంఘం వ్యవస్థాపకుడు రమేష్‌బాబు అన్నారు. ఆదివారం శ్రీగౌరీదేవి బలిజ మహిళా సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షురాలు ఉషాదేవి అధ్యక్షతన రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఉద్యోగులతో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్, వైద్యులుగా, ఉపాధ్యాయులుగా కార్మికులుగా తదితర శాఖల్లో పనిచేస్తున్న బలిజ ఉద్యోగస్థులు వివిధ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం దృష్టికి వారి సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించి అండగా ఉంటామన్నారు. ప్రతి ఒక్క బలిజ ఉద్యోగుస్తులు సంఘంలో చేరాలని కోరుతున్నామన్నారు. అనంతరం వేసవి సెలవుల్లో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ఉచిత శిక్షణ ఉపాధ్యాయులు ఇండ్ల శ్రీనివాసులు, మిరియాల శివగణపతి, దామోదర్, శంకర్‌లకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మస్తాన్ రావు విశ్రాంత జేటీవో, శ్రీనివాసులు కార్యవర్గ సభ్యులు, మంజులాదేవి మహిళా అధ్యక్షురాలు, గండికోట సర్పంచ్ గురు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ షాపులు ప్రారంభం



యర్రగుంట్ల జూన్ 1 ప్రభాతవార్త

మున్సిపాలిటీ పరిధిలోని టవర్ బజార్, వినాయక నగర్ నందు గల చౌక దుకాణంలో ప్రారంభించిన జమ్మలమడుగు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ చదిపిరాళ్ళ భూపేష్ సుబ్బరామిరెడ్డి. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి మంచి జరుగుతుందని తెలిపారు. పేద బడుగు వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలన కొనసాగిస్తున్నారని, అందులో భాగంగా గత ప్రభుత్వం చేసిన పొరపాటు సరిదిద్దుతూ ఐదు రోజులు ఇచ్చే రేషన్ షాపులను 15 రోజుల వరకు నాణ్యమైన బియ్యం, నిత్యవసర సరుకులను ఇచ్చే విధంగా చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యర్రగుంట్ల మండల ఎన్డీఏ కూటమి ఇన్చార్జ్ మధుసూదన్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు, ఎర్రగుంట్ల మున్సిపాలిటీ స్టోర్ డీలర్లు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల సముదాయానికి రక్షణ కల్పించి శుభ్రంగా ఉంచాలి

జమ్మలమడుగు, జూన్ 1, ప్రభాతవార్త:



జమ్మలమడుగు పట్టణంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల సముదాయాలు అయిన వాటికి రక్షణ కల్పించి పరిశుభ్రంగా ఉంచాలని సీఐటీయూ పట్టణ ఉపాధ్యక్షుడు ఎ.వినయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ఉన్న ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఐసీడీఎస్ కార్యాలయం, ఉపాధి కార్యాలయం, స్త్రీ, శక్తి భవన కార్యాలయం పంచాయతీరాజ్ కార్యాలయం, ఇరిగేషన్, మానసిక వికలాంగుల చిన్న పిల్లల స్కూలు, గ్రంథాలయ కార్యాలయ ఆవరణలో ఉన్నాయని తెలిపారు. అయితే కొంత మంది ఆకతాయిలలో ఈ కార్యాలయ ఆవరణలో మద్యం సేవించి వ్యసనాలకు పాల్పడుతూ ఎక్కడ పడితే అక్కడ మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. తక్షణమే పోలీసు శాఖ అధికారులు ప్రభుత్వ కార్యాలయాల సముదాయాల్లో రాత్రి పూట మద్యం సేవిస్తూ, వ్యసనానికి పాల్పడుతున్నట్లు గుర్తించి శిక్షించాలని తెలిపారు.

## రేషన్ దుకనాలను ప్రారంభించిన తహశీల్దార్



చిన్నమండెం జూన్ 1 ప్రభాత వార్త:

మండల కేంద్రంలోని మాలపల్లె రేషన్ దుకాణాన్ని ఆదివారం తహసీల్దార్ నరసింహులు తన సిబ్బందితో కలిసి ప్రారబించారు.అనంతరం రేషన్ బియ్యాన్ని అర్హులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ బియ్యాన్ని వినియోగదారులు సక్రమమైన పద్ధతిలో ఉపయోగించు కోవాలని ఆయన సూచించారు. డీలర్లు తూనికలలో వ్యత్యాసం లేకుండా పంపిణీ చేయాలని చెప్పారు .ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మరియు గ్రామ ప్రజలు వినియోగదారులు పాల్గొన్నారు.

## వెన్నుపోటు దినం విజయవంతం చేయండి



పీలేరు, జూన్ 1 ప్రభాతవార్తః

జూన్ 4న నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హరిప్రసాద్ రెడ్డి, రాష్ట్ర ప్రచార విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ జూన్ 4వ తేదీన తలపెట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేసే క్రమంలో భాగంగా జిల్లా పరిధిలోని అన్ని స్థాయిలలో పార్టీ అనుబంధ విభాగ అధ్యక్షులను, కమిటీ సభ్యులను సమన్వయం చేసుకొని కార్యక్రమాన్ని అన్ని నియోజకవర్గాల్లో విజయవంతం చేసేందుకు కృషి చేయవలసిందిగా కోరుతున్నారు

## యాసిడ్ తాగి మహిళ ఆత్మహత్య

రామసముద్రం జూన్ 1 ప్రభాతవార్త

యాసిడ్ తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు మండలంలోని అర్.నడింపల్లి పంచాయతీ ఎగువ నల్లప్పగారి పల్లె కు చెందిన తుమ్మల వెంకటరమణ కూతురు భాగ్యమ్మ 35 ను గుర్రంకొండ మండలంలోని లక్కవారి పల్లెకు చెందిన మల్లికార్జున తో గత వివాహం జరిగింది. అయితే భార్యాభర్తలిద్దరికీ మనస్పర్థలు రావడంతో గత ఎనిమిదేళ్ళ భాగ్యమ్మ పుట్టింటికి వచ్చేసింది. భాగ్యమ్మకు పిల్లలు పుట్టకపోవడం,భర్తను వదిలి రావడం వంటి కారణాలతో భాగమ్మ గత కొన్ని రోజులుగా ముభావంగా ఉండేదని ఈ నేపథ్యంలో శనివారం ఉదయం యాసిడ్ తాగి అపస్మారక స్థితిలో ఉండగా మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు మృతురాలి అన్న మల్లికార్జున పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్సై రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్లు తెలిపారు.

## హాల్‌టికెట్ల డౌన్లోడ్ సమస్యను పరిష్కరించాలి



బద్వేల్ అర్బన్ జూన్ 01 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ హాల్ టికెట్లను మే 30వ తేదీ నుండి డౌన్లోడ్ చేసుకోమని తెలియజేసింది. కానీ రకరకాల సమస్యల వల్ల 31వ తేదీ ఉదయం నుండి డౌన్లోడ్ అవుతున్నాయి.కానీ అభ్యర్థులకు హాల్ టికెట్ డౌన్లోడ్ లో సమస్యలు తలెత్తుతున్నాయని ఎటువంటి సమస్యలు లేకుండా ప్రభుత్వం సవరించి అప్లై చేసుకున్న అందరికీ హాల్ టికెట్లు ఇవ్వాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని తెలిపారు. ఆదివారం బద్వేల్ పట్టణంలోని డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ హాల్ టికెట్లు రెండు,మూడు సబ్జెక్టులు అప్లై చేసుకున్నవారికి ఒకటే వస్తుందని సర్వర్ యు హావ్ మే నాట్ సెలెక్ట్ ఎనీ పోస్ట్ అని చాలామందికి చూయించడం జరుగుతున్నదని తెలిపారు. అయితే డీఎస్సీ అభ్యర్థులు ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు అప్లై చేసుకున్న వారికి ఒక పోస్టుకు మాత్రమే తేదీ సమయం చూపిస్తుంది. మిగిలిన పోస్టులకు హాల్ టికెట్లో ఎప్పుడు పరీక్ష ఉంటుంది సెంటరు సమయం వివరాలు తెలియట్లేదు అన్నారు. కావున వెంటనే అప్లై చేసుకున్న అభ్యర్థులందరికీ అన్నీ పరీక్షలకు హాల్ టికెట్లు ప్రభుత్వము అందుబాటులో పెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విద్యాశాఖ పదవ తరగతి పరీక్ష ఫలితాలలో కూడా తప్పులు దొర్లినట్టు రీవాల్యుయేషన్ తర్వాత తెలిసింది. అలాగే 45 రోజుల్లో పరీక్ష పెట్టడానికి సిద్ధపడిన ప్రభుత్వానికి కనీసం హాల్ టికెట్లను సిద్ధం చేసి వెబ్ సైట్ లో ఉంచడంలో ఘోరంగా వైఫల్యం చెందిందని ఆరోపించారు. విద్యాశాఖ తప్పులు తడకల వల్ల ఇప్పటికే పర్సంటేజ్ సమస్యతో, వయస్సు సమస్యతో రాష్ట్రంలో లక్షలాదిమంది డీఎస్సీ పరీక్ష రాసుకునే అవకాశాన్ని కోల్పోయారని ఆరోపించారు. కావున ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్య పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్ షరీఫ్, ఎస్కే ఆదిల్, జిల్లా నాయకులు ఎస్ ప్రవీణ్ కుమార్, పట్టణ నాయకులు యువరాజ్, ప్రసాద్, నరసింహ ,తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ షాప్ వద్ద సరుకుల పంపిణీ



రామసముద్రం జూన్ 1 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని బజారు వీదులోని రేషన్ షాప్ ను మండలటిడిపి అధ్యక్షులు విజయ్ కుమార్ గౌడ్, తాహిసీల్దార్ నిర్మాలాదేవి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అందించే రేషన్ సరుకులను కార్డుదారులు ఇకపై రేషన్ షాపులు వద్దకెళ్లి తీసుకోవచ్చని అన్నారు. 1 తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ షాపుల ద్వారా సరుకులు పంపిణీ జరుగుతుందని, ప్రజలు ఇబ్బందులు పడవద్దని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టినటువంటి పథకంలో పేదల బియ్యం, సరుకులు పక్కదారి పట్టే అవకాశం లేదు అని, అలాగే అవినీతి అక్రమాలకు ఆస్కారం లేదని పూర్తి పారదర్శకతతో పేదలకు 15 రోజులు పాటు బియ్యం సరుకులు పంపిణీ జరుగుతుందని విజయ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు విజయ్ కుమార్ గౌడ్, తాహిసీల్దార్ నిర్మలాదేవి ,స్థానికం రాజేష్,ఆర్ ఐ వసీం, వీఆర్వో జగదీష్ , వీఆర్ఏలు,వాల్మీకి కిట్ట, డీలర్ శరణ్య నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

## రేషన్ షాపులో ప్రజలకు బియ్యం పంపిణీ:

ఒంటిమిట్ట జూన్ 01( ప్రభాతవార్త)

ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వము రాష్ట్ర ప్రజల సౌలభ్యం కొరకు కష్టాల్లో ఉపశమనం కలిగేందుకు జూన్ 1 నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా. చంద్రబాబు నాయుడు రేషన్ షాపులోనే ప్రజలకు బియ్యాన్ని సరఫరా చేయాల్సిందిగా ప్రతిపాదనలు చేసిన నేపథ్యంలో ఆదివారం మండల కేంద్రమైన ఒంటిమిట్టలోని రేషన్ షాపులో మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కొమర .వెంకట నరసయ్య ప్రజలకు బియ్యాన్ని పంపిణీ చేసి ప్రారంభించాడు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడుతూ గతంలో వైసీపీ హయాంలో సక్రమంగా ప్రజలకు రేషన్ బియ్యం అందక నానా తంటాలు పడ్డారని బియ్యం తీసుకోవడంలో సమస్యలు ఎదుర్కొన్నారని ఎవరికి సక్రమంగా అందలేదని టిడిపి హయాంలో ప్రజలు అటువంటి సమస్యలు ఎదుర్కోకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి చక్కని తరుణోపాయం ఆలోచించి అందరికీ రేషన్ బియ్యం అందే విధంగా పాత పద్ధతిలో రేషన్ షాపులో లభించే విధంగా ప్రతిపాదనలు చేయడం ఈనాటి నుంచి ఆచరణలో పెట్టడం ఎంతో శుభదాయకమన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో నిరుపేద బడుగు బలహీన వర్గాల ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉంటారని ప్రభుత్వం ప్రతిపాదించే సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి లభ్యం అవుతాయని ఆ విధంగా కార్యాచరణ చేస్తుందని తెలియజేశాడు. రేషన్ షాపులోనే ప్రజలకు లభించే బియ్యం ప్రతిపాదన అందరికీ ఆమోదంగా ఉంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డీలర్లు అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. పాత రేషన్ పద్ధతి విధానం మండల వ్యాప్తంగా అమల్లోకి రావడం సర్వత్ర ప్రజలందరూ సంతోషిస్తున్నారన్నారు. ఈ



# పాత పద్ధతిలోనే రేషన్ పంపిణీ

సిద్దవటం జూన్ 1 ప్రభాతవార్త:

ప్రభుత్వం అక్రమరేషన్ అరికట్టడానికి పాత పద్ధతిలోనే చౌక దుకాణాల డీలర్ ద్వారా అర్హులైన కార్డు లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేయడం జరుగుతుందని ఏపీ పంచాయతీ రాజ్ ఛాంబర్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య అన్నారు.మండలంలోని బొగ్గుడి వారి పల్లె పంచాయతీ ఆకురోపల్లెలో నూతన రేషన్ దుకాణాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎండియూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీతో బియ్యం పక్కదారి పడుతుందనే ఆరోపణలు రావడంతో పాత పద్ధతి విధానంలో డీలర్ ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రతి రేషన్ కార్డుదారునికి రేషన్ పంపిణీ చేసే విధంగా పెను మార్పులు తీసుకొచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి పులి బాలయ్య,గ్రామ కమిటీ సభ్యుడు పల్లె సుబ్బరాయుడు, చాపాటి వెంకటసుబ్బారెడ్డి,గాలి పెద్ద సుబ్బయ్య, పులి రమేష్,రామి రెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ పాలన

**మదనపల్లె జూన్ 1 ప్రభాతవార్త**

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు.ఆదివారం నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ చౌక దుకాణాల్లో నిత్యవసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం రేషన్ డీలర్ల వ్యవస్థను సర్వనాశనం చేసిందన్నారు. ఎండియు వాహనాలు కొనుగోలు చేసి,అందుకు సిబ్బందిని నియమించి కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. ఎండియు వాహనాల వలన ప్రజలకు ఒరిగింది శూన్యమన్నారు.ప్రస్తుతం రేషన్ డీలర్ల వ్యవస్థను పునరుద్ధరించడంతో ప్రజలకు నిర్దేశించిన సమయంలో రేషన్ డీలర్లు రేషన్ సరుకులు అందజేయాలని సూచించారు. నియోజవర్గంలోని మున్సిపాలిటీ, రూరల్ మండలం నిమ్మనపల్లి రామసముద్రం మండలాల్లోని చౌక దుకాణాల్లో నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. అనంతరం కురవంకలోని తాగునీటి బోరును ప్రారంభించారు. ప్రజలకు తాగునీటి ఎద్దడి శాశ్వత పరిష్కారం కోసమే బోర్ ను డ్రిల్ చేయడం జరిగింది అన్నారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.



బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

# క్రమశిక్షణ, పట్టుదలతో చదివితేనే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తాం

**ప్రొద్దుటూరు, జూన్ 1 ప్రభాతవార్త**

ప్రతి విద్యార్థి చదివే చదువుపై క్రమశిక్షణ, పట్టుదల కలిగి ఏకాగ్రతతో చదివితేనే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని రిటైర్డ్ పంచాయతీ రాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ సానా వెంకట రవీంద్ర వర్మ తెలిపారు. ఆదివారం స్థానిక తొగటవీర క్షత్రియ కళ్యాణ మండపంలో శ్రీ చౌడేశ్వరి తొగటవీర క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు బందారు సూర్యనారాయణ ఆధ్వర్యంలో 13వ సంవత్సరం 10, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన తొగటవీర క్షత్రియ విద్యార్థిని విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానోత్సవ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు ప్రస్తుతం క్రమశిక్షణ, ఏకాగ్రతతో చదవాలని, ప్రస్తుతం అందుబాటులో ఉన్న అన్ని రకాల అవకాశాలను గురించి తెలుసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా దాదాపు 115 మంది తొగటవీర క్షత్రియ విద్యార్థిని విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, ఆర్థిక సహాయం క్రింద 3,25,000 అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ చౌడేశ్వరి తొగటవీర క్షత్రియ సేవా సంఘం ఉపాధ్యక్షులు పట్టుపోగుల నాగేశ్వరరావు, పల్లా శేషయ్య ఉమ్మడిశెట్టి చౌడయ్య, జాయింట్ సెక్రటరీ పల్లా శంకరనారాయణ, కోశాధికారి గంజికుంట ఆంజనేయులు, కంభం పాములేటి తొగటవీర క్షత్రియ కులబాంధవులు, విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# చౌక డిపోల ద్వారానే నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకుల పంపిణీ ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ పురం రామమూర్తి



పీలేరులో చౌక దుకాణం ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్, తహశీల్దారు

**పీలేరు జూన్ 1 ప్రభాతవార్తః**

ప్రభుత్వ చౌక డిపోల ద్వారానే నిత్యావసర సరుకుల పంపిణీ జరుగుతుందని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామమూర్తి, తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు. ఆదివారం పీలేరు పట్టణం అయ్యప్ప రెడ్డి కాలనీలోని 9వ నెబరు చౌక దుకాణంలో నిత్యావసర సరుకుల పంపిణీని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దారు భీమేశ్వర రావు మాట్లాడుతూ ప్రతినెల 1 నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు వినియోగదారులకు నిత్యావసర సరుకులు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అలాగే 65 ఏళ్ల వయస్సు దాటిన వృద్ధులు, వికలాంగులకు డీలర్లు వారి ఇంటి వద్దకి వచ్చి బియ్యం, ఇతర సరుకులు అందజేస్తారని తెలియజేశారు. చౌక దుకాణం ప్రారంభంతోపాటు 65 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఇంటి వద్దకే సరుకులు పంపిణీ చేసే కార్యక్రమాన్ని కూడా వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కోటపల్లి బాబు రడ్డి, మండల పార్టీ కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, కోడి రామకృష్ణారెడ్డి, రెడ్డి బాష, సివిల్ సప్లై డిటి విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# అర్జునుడు తపసుమాను అధిరోహణకు పోటెత్తిన ప్రజలు





**చిన్నమండెం జూన్ 1 ప్రభాతవార్త:**

మండలంలోని కొత్తపల్లి గ్రామం మల్లూరు అమ్మ తల్లి దేవస్థానం నందు జరుగుతున్న మహాభారతము కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం అర్జునుడు తపసు మాను అధిరోహించే కార్యక్రమాన్ని నాటకము ద్వారా ప్రదర్శించారు. ఈ సన్నివేశాన్ని చూడడానికి ప్రజలు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా మరియు యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్దయెత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అర్జునుని తపసుమాను ఎక్కే కార్యక్రమంలో కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు.అలాగే సంతానం లేని మహిళలు వరపడ్డారు. ఈ కార్యక్రమానికి కొత్తపల్లి, మల్లూరు, వండాడి, చాకిబండ, దేవగుడిపల్లి గ్రామాల నుండే కాకుండా చిన్నమండెం మండలంలోని భక్తాదులు, మరియు ఇతర మండలాల భక్తులు కూడా అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు

# రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

**లక్కిరెడ్డిపల్లె : జూన్ 01 ప్రభాత వార్త**

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మేనల్లుడు టిడిపి యువ నాయకులు మోర్యా రెడ్డి ఆదివారం లక్కిరెడ్డిపల్లెలోని కొత్త స్టేట్ బ్యాంకు వీధిలోని డీలర్ షాప్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మోర్యా రెడ్డి మాట్లాడుతూ రేషన్ షాపు డీలర్లు ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ప్రతీ లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేయాలన్నారు. రేషన్ పంపిణీకి సంబంధించి తూకంలో తేడాలు లేకుండా ఖచ్చితమైన తూకంతో బియ్యం ఇవ్వాలన్నారు. ఇక నుండి ప్రతి నెల 1 వతేదీ నుంచి 15 వరకు ప్రతి రోజు ప్రభుత్వం నిర్దేశించిన సమయాల్లో ఉదయం 8.00 నుండి 12.00 గంటల వరకు అలాగే సాయంత్రం 4.00 గంటల నుండి 8.00 గంటల వరకు రేషన్ షాపులను తెరిచి ఉంచాలని రేషన్ డీలర్లకు ఆదేశించారు. ఎఫ్.పి. షాప్ నెంబర్ పని వేళలు ధరలు, సరుకు నిల్వను సూచించే బోర్డును తప్పని సరిగా డిస్ప్లే చేయాలన్నారు. అనంతరం టిడిపి నాయకులు మోర్యా రెడ్డి మహిళలు, వృద్ధులకు రేషన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు, మండల టీడీపీ నాయకులు యనమల మదన్ మోహన్, బీజేపీ మండల అధ్యక్షుడు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కొండూరు వెంకట్రామ రాజు, రాజంపేట డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి షఫీ నాయక్, డీలర్ అమీర్, మసూద్, ఓబులేసు, ముక్త్యార్ అహ్మద్, మల్లి, శ్రీధర్, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



రేషన్ షాపును ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు మోర్యా రెడ్డి

# వైభవంగా మహంకాళి అమ్మ జాతర

**పెనగలూరు జూన్ 1 ప్రభాతవార్త**



మండలంలోని బెస్తపల్లి గ్రామంలో ఆదివారం గ్రామ దేవత ఉజ్జయని మహంకాళి అమ్మ జాతర వైభవంగా జరిగింది. గ్రామ ప్రజలు ఏర్పాటుచేసిన విందు భోజనాలతో బెస్త పల్లి గ్రామం ప్రతి ఇల్లు బంధుమిత్రుల తో కలకలాడింది. ఇదిలా ఉండగా బుధవారం రాత్రి గ్రామ పొలిమేరలోని గంగమ్మ గుడి నుండి పోతుల రాజు మెరవడితో మహంకాళిఅమ్మ దేవాలయం వరకు వైభవంగా గ్రామోత్సవం జరిగింది. పోతల రాజు గంగమ్మ మహంకాళి అమ్మ దేవాలయం చేరుకున్న తర్వాత తెల్లవారుజామునండి మహంకాళి అమ్మవారి గ్రామహోత్సవం ప్రారంభమైంది. యువత్సవంలో ఎవరింటి దగ్గర వారు జంతు బలులిచ్చి అమ్మవారికి మొక్కు తీర్చుకున్నారు. ఇదిలా ఉండగా పెనగలూరు గ్రామంలో రేణుక ఎల్లమ్మకు వైభవంగా పొంగళ్ళ కార్యక్రమం జరిగింది. రాత్రి ఆశాధికత తెల్లవారుజామున బలి చాట ఊరేగింపు తర్వాత దేవాలయంలో ముద్ద పెట్టుకోవడం కోడిపుంజులు పొట్టేలు మేకపోతులు బలి కార్యక్రమం జరిగింది.



## కూటమి వైఫల్యాలను ప్రజలకు వివరించడానికే

# వెన్నుపోటు దినం వెన్నుపోటు గోడపత్రికలు ఆవిష్కరణ

**మదనపల్లె జూన్ 1 ప్రభాతవార్త**

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడానికే వైకాపా అధినాయకత్వం ఆదేశాల మేరకు జూన్ 4వ తేదీన వెన్నుపోటు దినోత్సవంగా రాష్ట్రమంతా జరుపుకోవాలని నిర్ణయించడం జరిగిందని మదనపల్లె నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ వెల్లడించారు. ఆదివారం మదనపల్లె వైసిపి కార్యాలయంలో వెన్నుపోటు దినోత్సవం పోస్టర్ల ఆవిష్కరణ ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో వైసిపి నాయకులు,కార్యకర్తలు హాజరయ్యారు.ఈ సందర్భంగా నిస్సార్ అహమ్మద్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఏడాది కాలంలో ఒక్కటి కూడా పూర్తిగా అమలు చేయకుండా అన్నివర్గాల ప్రజలను వెన్నుపోటు పొడిచిందని విమర్శలుగుప్పించారు.ఉ ద్యోగస్తులకు టిఎ, డిఎ,పిఆర్సి ఇవ్వలేదన్నారు. రైతుల పరిస్థితి మరి దయనీయంగా ఉందన్నారు. ముఖ్యంగా మదనపల్లె ప్రాంతంలో టమోటా రైతుల దుస్థితి దారుణంగా ఉందని, ధరలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాదయాత్ర సందర్భంగా లోకేష్ ఇచ్చిన హామి ఏమైంది, టమోటా రైతుల కోసం టమోటా ప్రాసెసింగ్ యూనిట్, కోల్డ్ స్టోరేజ్ ఏమైందన్నారు. గిట్టుబాటు ధరలు లేకపోగా ఫర్టిలైజర్ దొరకలేదన్నారు. నిరుద్యోగులకు ఉపాధి లేకపోవడం, ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి ఇవ్వలేదని విమర్శలు గుప్పించారు. వాలంటీర్లు, యండియూ వాహనాల తొలగించి వారి జీవితాల్లో అంధకారం నింపారన్నారు. మహిళలకు ఎలాంటి పథకాలు అందడం లేదన్నారు.రాజంపేట పార్లమెంటు సభ్యులు పివి.మిథున్ రెడ్డి మదనపల్లెకు మంజూరు చేయించిన సెంట్రల్ యూనివర్శిటీ ఏమైందని ప్రశ్నించారు. గత వైసిపి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు నెలవారి పట్టిక తయారు చేసి ఆయా నెలలో వారికి ఖచ్చితంగా బటన్ నొక్కి అమలు చేయడం జరిగిందని తద్వారా ప్రజలంతా సంక్షేమ పథకాలు అందుకున్నారని వివరించారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు, చేనేత కార్మికులు ఇలా అన్ని వర్గాల వారిని చంద్రబాబు మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వ పాలనతో రాష్ట్ర ప్రజలకు నష్టమే కానీ లాభం లేదన్నారు. కేవలం వారి తప్పులను కప్పిపుచ్చుకోవడానికి వైసిపి అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి,ఆ పార్టీ నేతలపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. జూన్ 4వ తేదీ బుధవారం మదనపల్లి పట్టణం నుండి చిత్తూరు బస్టాండ్ నుండి శాంతియుత ర్యాలీగా వెళ్లి సబ్ కలెక్టరుకు వినతి పత్రం అందజేయడం జరుగుతుందన్నారు. కావున ఈ కార్యక్రమానికి వైసీపీ శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మనూజా రెడ్డి,జెడ్పిటీసి ఉదయ్ కుమార్, లియాఖత్ అలీ,కౌన్సిలర్లు పాల్ చంద్రశేఖర్,దండు కృష్ణారెడ్డి,దండు శేఖర్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, మదనపల్లె, నిమ్మనపల్లి, రామసముద్రం మండల అధ్యక్షులు దండు కరుణాకర్ రెడ్డి,శ్రీనివాసులు రెడ్డి, కేశవరెడ్డి,శీలం రమేష్, అనంత మునిశేఖర్, ఖాదర్ వలి, శారదరెడ్డి, నాగమణి, యూనస్, చిప్పిలి మల్లికార్జున రెడ్డి,కొత్తపల్లి మహేష్ బాబు,చరణ్,చిన్న,మయూర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యోగపై శిక్షణ

**బద్వేల్ అర్బన్, జూన్ 1, ప్రభాతవార్త**

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం మరియు జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు యోగాంధ్ర 2025 ప్రచారంలో భాగంగా మునిసిపల్ కమీషనర్ నరసింహారెడ్డి అధ్యక్షతన ఆదివారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఎదురుగా యోగ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమీషనర్ నరసింహా రెడ్డి మాట్లాడుతూ యోగా అనేది ఒక వ్యక్తి తన శరీరానికి, మనసుకు మరియు ఆత్మకు సంబంధించిన సమతుల్యతను సాధించడం జరుగుతుందన్నారు. మానసిక, శారీరక ఆనందం పొందడంతో పాటు శారీరక, మానసిక మరియు ఆధ్యాత్మిక శ్రేయస్సును పెంపొందించడానికి సహాయపడుతుందన్నారు. ఒత్తిడిని తగ్గించడానికి మరియు మానసిక స్పష్టతను పెంచడానికి తోడ్పడుతున్నారు. అనంతరం యోగ ట్రైనర్ అమరనాథ్ రెడ్డి, నంద గోపాల్ సూచనల ప్రకారం యోగ సాధన చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఆఫీసు సిబ్బంది మరియు సచివాలయం సిబ్బంది మరియు మెప్మా సిబ్బంది, విద్యార్థులు మరియు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## షరియా, ఖాజీ కోర్టులకు

# చట్ట పరమైన గుర్తింపు లేదు

(సుప్రీం కోర్టు స్పష్టీకరణ)

**బద్వేలు లీగల్, జూన్ 01 ప్రభాతవార్త :**

కోర్ట్ ఆఫ్ ఖాజీ (దారుల్ ఖాజా) ఖాజీయత్, షరియా కోర్టు మొదలైన వాటికి ఏ పేరున వున్నా చట్ట పరంగా ఏ గుర్తింపు లేదని, అవి ఇచ్చిన ఏ ఆదేశమైనా చట్ట పరంగా అమలు చేయలేమని సుప్రీం కోర్టు సుస్పష్టం చేసింది. 2014 లో విశ్వలోచన్ మదన్ ఎదిరి యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో షరియా కోర్టులు, ఫత్వాలకు చట్ట పరమైన అనుమతి లేదని సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును జస్టిస్ సుధాన్షు ధులియా, జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లాతో కూడిన ధర్మాసనం గుర్తు చేసింది. వివరాలలోకి వెళితే... వివాహంలో వివాదానికి భార్యే కారణమని, ఆమెకు భర్త ఎలాంటి భరణం చెల్లించాల్సిన అవసరం లేదని కుటుంబ న్యాయస్థానం తీర్పునివ్వగా దానిని అలహాబాద్ హైకోర్టు సమర్థించింది. ఇలా న్యాయస్థానాలు తనకు భరణం నిరాకరించడాన్ని అప్పీలు చేస్తూ బాధిత మహిళ సర్వోన్నత న్యాయస్థానంలో కేసు వేయగా ధర్మాసనం విచారణ చేపట్టి ఖాజీ కోర్టు ముందు దాఖలు చేసిన రాజీ డీడ్ ఆధారంగా ఫ్యామిలీ కోర్టు సదరు ఆదేశాలను జారీ చేసింది. కుటుంబ న్యాయస్థానం వ్యవహరించిన తీరును ధర్మాసనం తప్పుపడుతూ కోర్ట్ ఆఫ్ ఖాజీ కోర్ట్ ఆఫ్ (దారుల్ ఖాజా) ఖాజీయత్, షరియా కోర్టు మొదలైన వాటికి చట్ట పరంగా ఏలాంటి గుర్తింపు లేదని విశ్వలోచన్ మదన్ కేసులో సుప్రీం కోర్టు పేర్కొన్నట్లుగా అటువంటి సంస్థలు ఏ పేరుతో ప్రకటన గానీ, నిర్ణయంగానీ జారీ చేసినా దానికి ఎవ్వరు కూడా కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని, బలవంతంగా దానిని అమలు చేయడం సాధ్యం కాదని ప్రభావిత పార్టీలు అటువంటి ప్రకటన లేదా నిర్ణయాన్ని అంగీకరించినపుడు అటువంటి చర్య మరే ఇతర చట్టంతోనూ విభేదించనపుడు మాత్రమే అలాంటి నిర్ణయాలు చెల్లుబాటు అవుతాయని, అదీ అమలు చేసేందుకు అంగీకరించిన పార్టీల మధ్య మాత్రమే చెల్లుబాటు అవుతుందని ధర్మాసనం సుస్పష్టం చేసింది. 2002 సెప్టెంబర్ 24న రెండవ ప్రతివాదికి అప్పీలుదారుతో ఇస్లామిక్ సాంప్రదాయాల ప్రకారం వివాహం జరిగింది. అది ఇద్దరికీ కూడా రెండవ వివాహము. 2005 లో ప్రతివాది నెం.2 మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో గల కోర్ట్ ఆఫ్ ఖాజీ 3లో అప్పీలుదారుపై విడాకుల కేసు (దావా నెం.325/2005) దాఖలు చేశారు. 2005 సంవత్సరం నవంబరు నెల 22న రెండు పార్టీల మధ్య కుదిరిన రాజీ కారణంగా అది కొట్టివేయబడింది. 2008 లో భర్త ఖాజీయత్ కోర్టు (దారుల్ ఖాజా) ముందు విడాకుల కోసం మరొక దావా వేయగా అదే సంవత్సరం భార్య భరణం కోరుతూ సెక్షన్-125 సిఆర్‌పిసి క్రింద కుటుంబ కోర్టును ఆశ్రయించింది. 2009 లో దారుల్ ఖాజా కోర్టు విడాకులకు అనుమతి ఇచ్చిన తరువాత తలాక్‌నామా ప్రకటించబడింది. రెండో ప్రతివాది అప్పీలుదారు అయిన తన భార్యను విడిచిపెట్టలేదని, ఆమె స్వభావము, ప్రవర్తనలే కారణంగా వివాదానికి ప్రధాన కారణమని ఆమే స్వయంగా ఇంటి నుండి వెళ్ళిపోయిందని నిర్ధారించడం ద్వారా కుటుంబ కోర్టు అప్పీలుదారు భరణం కోసం చేసిన అభ్యర్థనను త్రోసిపుచ్చింది. పార్టీలిద్దరికీ రెండవ వివాహం కాబట్టి భర్త వరకట్నం డిమాండ్ చేసే అవకాశం లేదన్న కుటుంబ కోర్టు నిర్ణయాన్ని సుప్రీం కోర్టు తిరస్కరిస్తూ కుటుంబ కోర్టు చేసిన టువంటి తర్కం లేదా పరిశీలన చట్ట నియమాలకు అనుగుణంగా లేదని, అది కేవలం ఊహపై, అంచనాపై మాత్రమే ఆధారపడిందని రెండు పార్టీలకు రెండవ వివాహం కనుక వరకట్నం డిమాండ్ ఉండి ఉండకపోవచ్చని కుటుంబ కోర్టు తీర్మానించడం సరి కాదు అని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. రాజీ పత్రం లేకుండా కుటుంబ కోర్టు చేసిన నిర్ధారణలకు ఏ రకంగానూ ఆధారంగా లేదని కోర్టు అభిప్రాయపడుతూ రాజీ పత్రంలో అప్పీలుదారు తన తప్పును అంగీకరించారనే అంశం ఆధారంగా ఈ నిర్ధారణ జరిగిందని, అయితే రాజీ పత్రాన్ని పరిశీలిస్తే అలాంటి అంగీకారం ఏదీ నమోదు కాలేదని స్పష్టమైందని 2005 లో భర్త దాఖలు చేసిన మొదటి విడాకుల దావా ఈ రాజీ ఆధారంగానే కొట్టివేయబడిందని రాజీలో ఇరుపక్షాలు కలిసి వుంటామని ఇతరులకు పిర్యాదు చేసేందుకు అవకాశం ఇవ్వబోమని మాత్రమే అంగీకరించారని, అందువల్ల అప్పీలుదారుకు భరణాన్ని తిరస్కరించడానికి చూపిన ఆధారం లేదా కారణం నిలకడ లేనిదిగా ఉన్నట్లు పై పరిశీలనలోనే తేలిపోయిందని కోర్టు పేర్కొంటూ కుటుంబ కోర్టులో భరణం పిటీషన్ దాఖలు చేసిన తేదీ నుండి అప్పీలుదారుకు నెల నెలా భరణం చెల్లించాలని కోర్టు ఆ వ్యక్తిని ఆదేశిస్తూ ఈ తీర్పును వెలువరించింది. (షాజహాన్ ఎదిరి స్టేట్ ఆఫ్ ఉత్తర ప్రదేశ్, స్పెషల్ లీవ్ పిటీషన్ (క్రిమినల్) నెం.10430/2018)

## పొన్నేటిపాలెం చెరువు పూడికతీతపై

# అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

**బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్**



**మదనపల్లి, జూన్ 1 ప్రభాతవార్త.**

జిల్లాలో చిన్నతరహా నీటిపారుదల శాఖ పరిధిలోని మదనపల్లి పొన్నేటిపాలెం పంచాయతీలో సాగునీటికి ప్రధాన ఆధారమైన ఎర్రకదిరినాయని చెరువు దశాబ్దాలుగా మరమ్మతులకు, పూడిక తీత పనులు చేపట్టకపోవడం వల్ల శిథిలావస్థకు చేరుకుందని బిజెపి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఈ చెరువును సందర్శించిన బీజేపీ నాయకులు, చెరువు పరిస్థితిని రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సాయి లోకేష్ మాట్లాడుతూ దాదాపు 150 ఎకరాల ఆయకట్టు కలిగిన ఈ చెరువు పిచ్చిమొక్కలు, ముళ్ల కంపులతో నిండిపోయిందన్నారు. తూములు, పంట కాలువలు పాడైపోగా, గట్లు బలహీనంగా తయారయ్యిందన్నారు. ప్రస్తుతం చెరువు నిండిన తర్వాత కేవలం 34 నెలలు మాత్రమే రైతులకు నీరు అందు తుందని, మరమ్మతులు చేపడితే 12 నెలలు నీరు అంది, రైతులు రెండు పంటలు సాగు చేయగలమని రైతులు తెలియజేశారన్నారు. చెరువు సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని రైతులకు సాయి లోకేష్ హామీ ఇచ్చారు. అలాగే, మదనపల్లిబెంగళూరు రహదారి పై నుంచి వినాయక్ కాలనీకి సీసీ రోడ్డు అత్యవసరమని, దాదాపు 400 కుటుంబాలు నివసించే కాలనీకి సీసీ రోడ్డు లేక ప్రజలు ఎంతో అవస్థ పడుతున్నారన్నారు. ఈ సమస్య పరిష్కారానికి కూడా కృషి చేస్తామని తెలిపారు. ఈ పర్యటనలో స్థానిక బీజేపీ నాయకులు బండి ఆనంద్, శివ యాదవ్, వేంకటరమణ రెడ్డి, వాసు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## హౌసింగ్ లబ్ధిదారులు

# రూ 50వేలు సద్వినియోగం చేసుకోండి



**తంబళ్లపల్లె జూన్ 1 ప్రభాతవార్త ః**

హౌసింగ్ లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ 50 వేలు సహాయం అందిస్తోందని లబ్ధిదారులు పనులు వేగవంతం చేసి గృహాలు పూర్తి చేసుకోవాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ చీఫ్ ఇంజనీర్ వేణుగోపాల్ సూచించారు. ఆదివారం ఆయన తంబళ్లపల్లె నియోజకవర్గం పరిధిలోని బి కొత్తకోట మండలం బీరంగి గ్రామంలో నిర్మాణంలో ఉన్న పలు పక్కా గృహాలను ఆకస్మిక తనిఖీలో భాగంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన హౌసింగ్ లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడారు. లబ్ధిదారులు పక్కా గృహాల నిర్మాణాల పై తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గృహ నిర్మాణాలకు ఇసుక, సిమెంట్, కూలీలు, ఇటుకలు, నీరు సకాలంలో అందుతున్నాయా లేదాని అడిగి తెలుసుకున్నారు. పక్క గృహ నిర్మాణ ప్రక్రియలో హౌసింగ్ అధికారులు సకాలంలో స్పందిస్తున్నారా మీకు పక్కా గృహాలు త్వరగా పూర్తి చేయడానికి ఆర్థిక పరంగా ప్రభుత్వం రూ 50,000 మంజూరు చేస్తుందని దీనికి తోడు స్థానికంగా సమస్యలు ఉంటే హౌసింగ్ అధికారుల దృష్టికి తెస్తే వెంటనే పరిష్కారానికి సహకరిస్తామన్నారు. పక్కా గృహాల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఇందుకు హౌసింగ్ అధికారులు లబ్ధిదారులకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి ముందు ఉండాలని సూచించారు. ఆయన వెంట అన్నమయ్య జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి సాంబశివయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ రెడ్డి, డి ఈ వెంకట్ రెడ్డి, బి కొత్తకోట హౌసింగ్ మండల ఏఈ లావణ్య, అర్బన్ ఏ ఈ జియాపుజైల్, అధికారులు, హౌసింగ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ చౌక దుకాణాలు

# ప్రజలకు అందుబాటులో ఉండాలి



**కె.వి పల్లి జూన్ 1 ప్రభాతవార్త**

ప్రభుత్వం నిర్దేశించిన సమయం మేరకు ఎల్ల వేళలా ప్రజలకు అందుబాటులో ఇకపై ప్రభుత్వ చౌకదుఖాణాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని పీలేరు నియోజకవర్గ తెదేపా నాయకులు కుభం నిరంజన్ రెడ్డి అన్నారు ఆదివారం బజారువీధిలోని ప్రభుత్వ చౌకదుఖాణాన్ని మార్కెటు కమిటీ చైర్మన్ కొసూరి చంద్రమోళితో కలిసి ఆయన రిబ్బను కత్తిరించి ప్రారంభించారు అనంతరం లబ్దిదారులకు ఆయన రేషన్ సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మేరకు చౌక దుఖాణాలు తెరిచే ఉంటాయని, వ్యవసాయ పనులు, సొంత పనులు చూసుకుని మిగిలన సమయంలో సరుకులు పొందవచ్చునని సూచించారు. లబ్దిదారులు రాత్రింబవళ్లు ఇకపై క్యూలలో నిరీక్షించాల్సిన అవసరం లేదన్నారు తెదేపా ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం పని చేస్తోందన్నారు. వచ్చే మాసంలో సూపర్ సిక్స్లోని కొన్ని హామీలను ప్రభుత్వం అమలు చేయనుందని, అర్హులైన లబ్దిదారులందరికీ వారి వారి ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు. వీటిలో ప్రధానం తల్లికి వందనంతో పాటు రైతు ఖాతాల్లో నగదు జమ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో డీలర్ రెడ్డి, రాజంపేట ఎస్సీసెల్ అధ్యక్షుడు గాంధీపేట రమణ, మాజీ సర్పంచి రాజేంద్రచారి, తెదేపా నాయకులు పీసీ నారాయణ, కోసూరి రమేష్ న్యాయవాది రమణ, మురళి, శివ, బలందర్, డీటీ వెంకటస్వామి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

**కలికిరి, జూన్ 1, ప్రభాతవార్త:**



రాష్ట్రంలో ప్రజల సంక్షేమమే ధ్యేయంగా తెదేపా ప్రభుత్వం పనిచేస్తున్నట్లు తెదేపా సీనియర్ నాయకులు ఇస్మాయిల్ పేర్కొన్నారు. ఆదివారం గడి గ్రామంలో పండగ వాతావరణంలో రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ఇస్మాయిల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ షాబుద్దీన్, తెదేపా నాయకులు గయాజ్, ఎసానుల్లా, ఖాసీం, మస్తాన్, చోలా, డీలర్ ఎం.డి.రఫీ తదితరులు పాల్గొన్నారు.